RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 337 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 డిసెంబర్ 2024 శనివారం పేజీలు : 4

## 'జిల్లు' మంటున్న ఊటీ..

చెన్నై: నీలగిరి జిల్లాలో ప్రతి ఏడాది అక్టోబరు నెలాఖరు వరకు నీటి మంచు కనిపిస్తుంది. నవంబరు రెండో వారం నుంచి చలికాలం ప్రారంభమవుతుంటుంది. ఈ ఏడాది కొన్ని నెలలుగా అప్పుడప్పుడూ భారీ వర్షాలు కురుస్తుండడంతో, కొద్దిరోజులుగా ఎండ తీవ్రత కూడా నెలకొంది. గత వారం నుంచి ఊటీలో మంచు కురవడం ప్రారంభమైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 5 డిగ్రీలు నమోదయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో దట్టమైన మంచు కురిసింది. శివారు ప్రాంతాలైన కాంతల్, కలైకుంద, హెచ్‌పీఎఫ్, షూటింగ్ స్పాట్ తదితర ప్రాంతాల్లో మంచుతో ఎదురుగా వచ్చే వారు కూడా కనిపించని స్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో, ఊటీలో గరిష్ట ఉష్ణోగ్రత 17 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 3.2 డిగ్రీలు, శివారు ప్రాంతాల్లో 1 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

# లెక్కకందని విరాళాలు..

# కుబేరుల లిస్టులో 'కమలం'!




## వరల్డ్ బ్యాంకు అప్పు తీర్చేంత డబ్బు?

హైదరాబాద్ : ప్రతి దానికీ ఓ లెక్క ఉంటది. దానికి.. ఏదో ఒక దగ్గర ఎండ్ ఉంటది. కానీ.. ఈ దేశంలో కొన్ని రాజకీయ పార్టీలకు వస్తున్న డొనేషన్లకు మాత్రం లెక్క లేదు. అందుకే.. ఇండియాలో ఇప్పుడు డొనేషన్.. సెన్సేషన్‌గా మారింది.

జస్ట్.. ఒక్క ఏడాదిలోనే బీజేపీకి వచ్చిన పార్టీ ఫండ్ 200 శాతానికి పైగా పెరిగిందంటే.. పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇది ఒక్క బీజేపీకే పరిమితం కాదు. మనం తెలుసుకోవాల్సిన లెక్కలు.. చాలానే ఉన్నాయి.

**పార్టీ ఫండ్స్ విషయంలో బీజేపీదే అగ్రస్థానం :** ఇవి జస్ట్ నెంబర్స్ కావు.! అక్షరాలా.. ఈ దేశంలో పాపులర్ పొలిటికల్ పార్టీలకు వచ్చిన విరాళాలు. ఇదంతా.. జస్ట్ ఒక్క ఏడాదిలోనే! వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ.. రాజకీయంగా పీక్ స్టేజ్‌లో ఉంది. ఆ పార్టీ పెర్ఫార్మెన్స్ కూడా అదే స్థాయిలో ఉంది. ఏ ఎన్నిక వచ్చినా.. సత్తా చాటుతోంది. కానీ.. ఇది జస్ట్ ఎలక్షన్లకే పరిమితం కాలేదు. ఆ పార్టీకి వస్తున్న విరాళాలు కూడా అదే స్థాయిలో ఉన్నాయ్. ఈ దేశంలోని మిగతా పొలిటికల్ పార్టీలతో పోలిస్తే.. బీజేపీకి విరాళాలు ఇస్తున్న వారి లిస్టు చాలా పెద్దది. అదే ఆ పార్టీకి విపరీతంగా విరాళాలు వచ్చేందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనే.. బీజేపీకి 2 వేల 244 కోట్ల విరాళాలు అందాయ్. ఈ నెంబర్ చాలు.. బీజేపీ విషయంలో ఎవరి లెక్కలు ఎలా ఉన్నాయో చెప్పడానికి!

**ఈ ఏడాదిలో బీజేపీకి రూ.2,244 కోట్ల విరాళాలు :** ఈ మధ్యకాలంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. బీజేపీ మంచి ఫలితాలనే సాధిస్తోంది. వరుస విజయాలతో సత్తా చాటుతున్న కమలం పార్టీకి.. మరోవైపు కాసుల వర్షం కురుస్తోంది. రోజురోజుకు.. బీజేపీకి విరాళాలిచ్చే వారి సంఖ్య పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. పార్టీ ఫండ్స్ విషయంలో.. భారతీయ జనతా పార్టీ కంటే ముందూ మరే పార్టీ లేదు. గత ఏడాదిలో వ్యక్తులు, ట్రస్టులు, కార్పొరేట్ సంస్థల నుంచి ఎక్కువ మొత్తంలో బీజేపీకి డొనేషన్స్ అందాయి. 20 వేల రూపాయల కంటే తక్కువ ఏ ఒక్కరూ ఇవ్వలేదు. అలా.. మొత్తంగా 2 వేల 244 కోట్లు అందాయి. ఇది.. అంతకుముందు ఏడాది.. అంటే 2022-23లో వచ్చిన విరాళాల కంటే మూడు రెట్లు ఎక్కువ. దాంతో.. పార్టీ ఫండ్స్ విషయంలో బీజేపీనే అగ్రస్థానంలో కొనసాగుతోంది.

**2023-24లో కాంగ్రెస్‌కు వచ్చిన ఫండ్ రూ.289 కోట్లు :** మరోవైపు.. గత ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్‌కు కూడా భారీగానే విరాళాలు అందాయి. 2023-24లో 289 కోట్ల పార్టీ ఫండ్ అందింది. అంతకుముందు సంవత్సరం కాంగ్రెస్‌కు 80 కోట్లు పార్టీ ఫండ్ వచ్చింది. దాంతో పోలిస్తే.. కాంగ్రెస్‌కు కూడా భారీగా పార్టీ ఫండ్ అందిందనే చెప్పాలి. అయితే.. బీజేపీ, కాంగ్రెస్ ప్రకటించిన మొత్తం విరాళాల్లో.. ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన డొనేషన్ల వివరాలు లేవు. ఎందుకంటే.. ఆ వివరాల్ని రాజకీయ పార్టీలు కేవలం ఆడిట్ రిపోర్టుల్లో మాత్రమే ప్రకటించాల్సి ఉంటుంది.

ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని సుప్రీంకోర్టు కూడా కొట్టివేసింది. కాబట్టి.. రాజకీయ పార్టీలకు వచ్చే విరాళాలు.. నేరుగానైనా రావాలి. లేనిపక్షంలో ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా నైనా రావాలి.

**బీఆర్ఎస్‌కు రూ.496 కోట్లు, వైసీపీకి రూ.122 కోట్ల ఫండ్ :** అయితే.. కొన్ని ప్రాంతీయ పార్టీలు మాత్రం 2023-24 కాంట్రిబ్యూషన్ రిపోర్టులో.. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా స్వీకరించిన విరాళాల్ని కూడా స్వచ్ఛందంగా వెల్లడించాయి. అందులో.. బాండ్ల ద్వారా దాదాపు 496 కోట్లు పొందిన బీఆర్ఎస్ కూడా ఉంది. అదేవిధంగా.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దాదాపు 122 కోట్లు, డీఎంకే 60 కోట్లు పొందాయి.

ఇక.. జేఎంఎం పార్టీ బాండ్ల ద్వారా పదకొండున్నర కోట్లు అందుకున్నట్లు ప్రకటించింది. ఇతర మార్గాల్లో.. ఆ పార్టీకి కేవలం 64 లక్షల రూపాయల విరాళాలు మాత్రమే అందాయి.

**2023-24లో తెలుగుదేశానికి రూ.100 కోట్ల పార్టీ ఫండ్ :** 2022-23 సంవత్సరంతో పోలిస్తే.. గత ఆర్థిక సంవత్సరంలో బీజేపీకి అందిన పార్టీ ఫండ్ 212 శాతం పెరిగింది. ఎందుకంటే.. ఇది ఎన్నికల సంవత్సరం కాబట్టి.. ఆ స్థాయిలో విరాళాలు వచ్చి ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. అయితే 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు సంవత్సరం.. బీజేపీ 742 కోట్లు, కాంగ్రెస్ దాదాపు 147 కోట్లు తమకు విరాళాలు ద్వారా అందినట్లు ప్రకటించాయి. అప్పటితో పోలిస్తే.. రెండు పార్టీలకు పార్టీ ఫండ్స్ భారీ స్థాయిలో పెరిగినట్లు అర్థమవుతోంది. ఇటీవలి కాలంలో ఎలక్టోరల్ ట్రస్ట్ రూట్ ద్వారా బీజేపీకి 850 కోట్లు వచ్చాయి. అందులో 723 కోట్లకు పైగా ప్రుడెంట్ నుంచి, 127 కోట్లు ట్రయాంఫ్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి, 17 లక్షల రూపాయలు ఎన్‌జిగార్టింగ్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి వచ్చాయి. కాంగ్రెస్‌కు కూడా ఎలక్టోరల్ ట్రస్ట్ రూట్‌లో.. ప్రుడెంట్ నుంచి 156 కోట్లకు పైగా విరాళం అందుకుంది.

**భారీ విరాళాల వెనుక బడా కార్పొరేట్ కంపెనీలున్నాయా? :** రాజకీయ పార్టీలకు అందుతున్న వందల కోట్ల విరాళాల వెనుక.. బడా కార్పొరేట్ కంపెనీలున్నాయ్. నిర్మాణరంగాన్ని ఏలుతున్న సంస్థలూ ఉన్నాయ్. ఒక పార్టీ అధికారంలోకి వస్తుందనే అంచనాలుంటే.. ఆ పార్టీకి వందల కోట్ల రూపాయల ఫండ్ ఇవ్వడం లాంటివి చేస్తున్నాయనే చర్చ జరుగుతోంది. మొత్తం ఒకే పార్టీకి ఇవ్వకుండా.. కొంత మొత్తంలో అపొజిషన్ పార్టీలకు కూడా ఇస్తున్నాయ్. ఫలితాలు తారుమారై.. వీళ్లు అధికారంలోకి వచ్చినా.. తర్వాత తమకు ఇబ్బంది లేకుండా ఉండేందుకే.. ప్రతిపక్ష పార్టీలకు కూడా కొంత మొత్తంలో ఫండ్ రూపంలో ముట్టజెబుతున్నారనే ప్రచారం ఉంది. ఇక.. తాము భారీ మొత్తంలో ఫండ్ సమర్పించుకున్న పార్టీ అధికారంలోకి వచ్చాక.. కాంట్రాక్టుల రూపంలోనే, మరో విధంగానో.. ఆ పార్టీల ప్రభుత్వాలు ఉన్న చోట.. లబ్ధి పొందాలనే ఆలోచనతోనే.. ఈ కంపెనీలన్నీ ఇంత భారీ మొత్తంలో పార్టీ ఫండ్ సమర్పించుకుంటున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయ్. ముఖ్యంగా.. మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్, సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, ఆర్సెలర్ మిట్టల్ గ్రూప్ , భారతీ ఎయిర్‌టెల్ లాంటి కంపెనీలన్నీ 2022-23లో ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్‌కు విరాళాలు అందించాయి. ఇక.. 2023-24కి సంబంధించిన దాతల జాబితాని.. ప్రుడెంట్ ఇంకా రిలీజ్ చేయలేదు. ఆ రిపోర్ట్ బయటకొస్తే.. ఏ కంపెనీ.. ఏ పార్టీకి ఎంత ఫండ్ ఇచ్చిందనేది తేలుతుంది.

## జనవరి మొదటి వారంలో పీసీసీ కొత్త కార్యవర్గం .. జాబితా ఫైనల్ చేసిన రేవంత్, దీపాదాస్ మున్షీ

### హైకమాండ్ ఆమోదముద్ర కోసం వెయిటింగ్

### గ్రీన్ సిగ్నల్ రాగానే ప్రకటించనున్న పీసీసీ చీఫ్ మహేశ గౌడ్



హైదరాబాద్ : పీసీసీ కొత్త కార్యవర్గ ఏర్పాటుపై కసరత్తు పూర్తయింది. ఎంత మందికి చోటు కల్పిస్తారు? ఎవరికి ఏ పదవులు ఇస్తారనే దానికి సంబంధించిన జాబితా కూడా రెడీ అయింది. ఈ జాబితాపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్?చార్జ్ దీపాదాస్ మున్షీతో పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చర్చించారు. వారిద్దరి సూచనల మేరకు కొన్ని మార్పులు చేసి జాబితాను ఫైనల్ చేశారు.

ఇక హైకమాండ్ ఆమోద ముద్ర వేయడమే తరువాయి. ఢిల్లీ పెద్దల నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే కార్యవర్గాన్ని ప్రకటించేందుకు పీసీసీ చీఫ్ సిద్ధంగా ఉన్నారు. జనవరి మొదటి వారంలోనే కొత్త కార్యవర్గాన్ని అనౌన్స్ చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ బుధవారం 'వెలుగు'కు చెప్పారు. అయితే, ఈ కార్యవర్గం మాత్రం పరిమితంగానే ఉంటదని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. ఇంతకుముందు కూడా మహేశ్ గౌడ్ పలు సందర్భాల్లో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నందున ప్రభుత్వ వైఫల్యాలను జనంలోకి తీసుకెళ్లేందుకు జంబో కార్యవర్గాన్ని ప్రకటించాల్సి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలో ఉండటంతో పరిమిత సంఖ్యలోనే కార్యవర్గం ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకుని.. ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సిఫార్సుల ఆధారంగా జాబితా సిద్ధం చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు త్యాగం చేసినోళ్లకు ఈ కార్యవర్గంలో చోటు దక్కే అవకాశాలున్నాయి. అయితే, హైకమాండ్ చేసిన సూచనతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసినట్లు ప్రచారం జరుగుతున్నది. రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు సుమారు 100 మందితో కార్యవర్గం ఏర్పాటు చేశారు. ఇప్పుడు సగానికి తగ్గించినట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.



## నేడు మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు

న్యూఢిల్లీ: భారత దేశ మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు శనివారం కేంద్రం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ఢిల్లీ ఎయిమ్స్ నుంచి మన్మోహన్ సింగ్ పార్థివదేహాన్ని గురువారం రాత్రి ఆయన అధికారిక నివాసం మోతిలాల్ నెహ్రూ మార్గ్ 3 కి తరలించారు. మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, పలువురు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. అలాగే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్ సభ స్పీకర్, కేంద్ర మంత్రులు మన్మోహన్ సింగ్ మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు.




# సంస్కరణల మేటి మన్మోహన్

## బంగారం తాకట్టు నుంచి ఆర్థిక వృద్ధి దాకా..!

### యావత్ భారతావని 'మన్మోహనుడి'కి నివాళులర్పిస్తోంది!!

భారత మాజీ ప్రధాని, ప్రఖ్యాత ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ నిన్న రాత్రి కన్నుమూశారు. యావత్ భారతావని ఆయనకు అశృనయనాలతో నివాళులర్పిస్తోంది. భారత ఆర్థిక రంగంపై దాదాపు రెండు దశాబ్దాల పాటు తనదైన ముద్ర వేసిన మన్మోహన్ సింగ్ మరణంతో దేశ ఆర్థిక వ్యవస్థ తనకు ఒకప్పుడు ప్రాణం పోసిన పితామహుడిని కోల్పోయింది. ఒకప్పుడు రహస్యంగా బంగారం తాకట్టు పెట్టే పరిస్థితుల్లో ఉన్న మన దేశాన్ని తన ఆర్థిక సంస్కరణలతో వృద్ధి నమోదు చేసే వరకూ నడిపించిన అపర మేధావి మన్మోహన్ మరణంతో దేశం పెద్ద దిక్కును కోల్పోయింది.

**భారత్ ఖజానా ఖాళీ :** 90వ దశకం ప్రారంభంలో భారత ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఖజానా ఖాళీ అయిపోయింది. దేశంలో విదేశీ మారక నిల్వలు ఎన్నడూ లేనంత దారుణంగా 1200 కోట్ల డాలర్లకు పడిపోయాయి. కేవలం మూడు వారాలు మాత్రమే మనం దిగుమతులు చేసుకునే దుస్థితికి వచ్చేశాం. కేంద్రం ఎవరికీ చెల్లింపులు చేసే పరిస్థితి లేక దాదాపు దివాళా తీసింది. అప్పటి చంద్రశేఖర్ ప్రభుత్వం అతి కష్టం మీద 67 టన్నుల బంగారం తాకట్టు పెట్టి ప్రపంచ బ్యాంక్ నుంచి అత్యవసర రుణం తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎవరికీ తెలియకుండా రహస్యంగా విమానంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ కు 47 టన్నుల బంగారాన్ని, యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్ కు 20 టన్నుల బంగారాన్ని తాకట్టుకు తరలించింది. దీంతో 600 మిలియన్ డాలర్ల రుణం తీసుకుంది. 1991 సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న సమయంలో రహస్యంగా ఈ ఆపరేషన్ పూర్తి చేసింది. ఈ విషయం ఆ తర్వాత తెలిసి దేశ ప్రజలు షాకయ్యారు. బంగారం తాకట్టుపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో చంద్రశేఖర్ ప్రభుత్వం కూలింది.

**పీవీ నరసింహారావు, మన్మోహన్ ఎంట్రీ :** ఇంత క్లిష్టమైన పరిస్థితుల్లో ఎన్నికల్లో నామమాత్రపు మెజార్టీతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ పీవీ నరసింహారావు నేతృత్వంలో మైనార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్లో గొప్ప ఆర్థిక వేత్తగా పేరున్న మన్మోహన్ సింగ్ ను ఆయన ఆర్థికమంత్రిగా నియమించారు.కాలం చెల్లిన భారత ఆర్థిక వ్యవస్థకు రిపేర్లు చేయడం మొదలుపెట్టిన వీరిద్దరూ అతి తక్కువ కాలంలోనే సక్సెస్ అయ్యారు. చారిత్రక సంస్కరణలతో భారత ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టడం మొదలుపెట్టారు. ఇందులో మన్మోహన్ సలహాలు కీలకంగా మారాయి.

**మన్మోహన్ ఏం చేశారంటే :** 1991 జూలై 1న మన్మోహన్ సింగ్ అసలు పని మొదలుపెట్టారు. ఆర్బీఐ జూలై 1న రూపాయి విలువను ఏకంగా 9శాతం తగ్గించింది. మరో రెండు రోజుల్లోనే మరో 11 శాతం తగ్గించింది. భారతదేశ ఎగుమతులను మరింత పోటీగా మార్చడం, దేశం ఆర్థిక లోటు తగ్గించడమే దీని లక్ష్యం. దీంతో మార్కెట్లు స్థిరీకరణ కావడం మొదలుపెట్టాయి. ఆ తర్వాత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు గేట్లు తెరిచారు. సుంకాల తగ్గింపు, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణలు వంటి చర్యలతో పెట్టుబడుల్ని ఆహ్వానించారు. దీంతో విదేశీ సంస్థలు, పెట్టుబడుల రాక మొదలైంది. ప్రపంచీకరణలో భారత్ భాగస్వామిగా మారింది. భారత్ లో విదేశీ వ్యాపారాలు విస్తరించడం మొదలైంది. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా పీవీ, మన్మోహన్ పట్టించుకోలేదు.

**దూసుకెళ్లిన భారత్..** 1991లో చేపట్టిన సంస్కరణల కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడం మొదలుపెట్టింది. దాంతో పాటే పేదరికం స్థాయిలు తగ్గడం మొదలైంది. విదేశీ పెట్టుబడులకు భారత్ హబ్ గా మారింది. ఐటీ, టెలికాం, ఫార్మా పరిశ్రమలు అభివృద్ధి చెందాయి.

2000ల నాటికి భారత్ ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది.పీవీ తర్వాత వాజ్ పేయ్ హయాం, ఆ తర్వాత 2004లో మన్మోహన్ హయాంలో ఈ సంస్కరణలు మరింత వేగంగా సాగాయి.2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం తలెత్తినప్పుడు ప్రపంచమే మన్మోహన్ సింగ్ మాట వినే పరిస్థితికి చేరింది. అలాగే భారత్ రెండంకెల ఆర్థిక వృద్ధిని అందుకుంది. ఈ ఏడాది భారత్.. ఇంగ్లాండ్ బ్యాంక్ లో తాకట్టు పెట్టిన బంగారం తిరిగి తెచ్చుకుంది.

# సంపాదకీయం

## కుమారస్వామీ...ఇది ఏమీ ?

కేంద్రంలో ఉక్కు గనుల శాఖ మంత్రిగా కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి జేడీఎస్ అధినేత కుమారస్వామి ఆరు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే ఆయన విశాఖ స్టీల్ ప్లాంట్ ని సందర్శించారు. కార్మికులు ఉద్యోగులతో మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ సామర్థ్యాన్ని ఆయన చూసి ప్లాంట్ కి భరోసా ఇచ్చారు. ప్రైవేటీకరణ వార్తల మీద కూడా కార్మికులు ఆయన దృష్టికి తీసుకుని వచ్చాను తాను తొందరలో కేంద్ర పెద్దలతో మాట్లాడి అన్నీ సానుకూలం అయ్యేలా చూస్తాని హామీ ఇచ్చి వెళ్లారు అయితే విశాఖ ఉక్కు గతి మారలేదు సరికదా మరింతగా ప్రైవేటీకరణ సాగుతోంది. ఆఖరుకు విషయం ఎంత దాకా వచ్చిందంటే స్టీల్ ప్లాంట్ లోని అగ్ని మాపక విభాగాన్ని కూడా ప్రైవేట్ కి ఇచ్చేందుకు తాజాగా నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో పాటు సకాలంలో కార్మికులు ఉద్యోగులకు జీతాలు రాకపోవడంతో పాటు అనేక ఇతర సమస్యలతో ప్లాంట్ ఉద్యోగులు సతమతమవుతున్నారు. ఇరవై వేల మంది దాకా ఉద్యోగులు కార్మికులు ఉన్న ప్లాంట్ ని ఆదుకోవాలని వారు కోరుతున్నారు. లాభాల బాటలోకి ప్లాంట్ రావాలి అంటే పదిహేను వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు. ఇటీవల విశాఖ ఎంపీ భరత్ కూడా కేంద్రం ప్యాకేజిని విశాఖ స్టీల్ ప్లాంట్ కి ప్రకటించాలని కోరారు. ఈ నేపథ్యంలో కర్ణాటక లోని స్టీల్ ప్లాంట్ కి పది హేను వేల కోట్ల రూపాయల ఆర్థిక ప్యాకేజీని కేంద్రం ప్రకటించింది. కుమార స్వామి సొంత రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థ విశ్వేశ్వరయ్య అండ్ ఐరన్ అండ్ స్టీల్ లిమిటెడ్ కి ఈ ప్యాకేజి దక్కడంతో విశాఖ ఉక్కు కార్మికులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఉక్కు మంత్రిగా ఉన్న కుమార స్వామి తన సొంత స్టేట్ బాగు కోసం చూడడంలో తప్పు లేదని అదే సమయంలో ప్రామిస్ చేసిన విధంగా విశాఖ ఉక్కు గురించి కూడా పట్టించుకోవాలి కదా అని అంటున్నారు. ఇంతకీ చూస్తే కర్ణాటక స్టీల్ ప్లాంటులో పనిచేసేది 250 మంది ఉద్యోగులు మాత్రమే అని అంటున్నారు ఇరవై వేల మంది దాకా పనిచేసే విశాఖ ఉక్కు గురించి కేంద్రానికి ఎందుకు పట్టదని వారు అంటున్నారు. లక్షల కోట్ల పాయేకీజిని ఏమీ కోరలేదు కదా అంటున్నారు. విశాఖ ఉక్కు పరిస్థితి ఇపుడు ఎటూ తేలకుండా అయోమయంగా ఉందని కూడా అంటున్నారు. మరో వైపు చూస్తే కీలకమైన ఉక్కు శాఖను కలిగిన ఉన్న కుమార స్వామి పార్టీ జేడీఎస్ కి ఉన్నది ఇద్దరే ఎంపీలు అంటున్నారు. ఆ ఇద్దరు ఎంపీలతోనే ఆయన కేంద్రం వద్ద తన పలుకుబడి ఉపయోగించి అక్కడ ఉక్కుని దన్నుగా నిలిచారని అంటున్నారు. ఏపీలో చూస్తే మొత్తానికి మొత్తం పాతిక మంది లోక్ సభ సభ్యులూ ఎన్డీయేకి ప్రత్యక్షంగా పరోక్షంగా మద్దతు ఇచ్చే వారే కదా అంటున్నారు. అయినా విశాఖ ఉక్కు ప్రైవేటుకు గురి అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నరు విశాఖ ఉక్కు విషయంలో కుమార స్వామి మీద ఆశలు పెట్టుకుంటే ఇలా జరిగిందేంటి అని కూడా కార్మికులు తల్లడిల్లుతున్నారు. మరో వైపు చూస్తే స్టీల్ ప్లాంట్ కార్మికులకు వేతన బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుని పోయాయని అంటున్నారు. వాటిని తక్షణం చెల్లించాలని కార్మికులు ఆందోళన చేస్తున్నారు. అదే విధంగా ప్లాంట్ కి సొంత గనులు కేటాయించి ఆర్థిక ప్యాకేజిని ప్రకటిస్తే బ్రహ్మాండంగా లాభాల బాట పడుతుందని అంటున్నారు. అదే సమయంలో సెయిల్ లో విలీనం చేయాలని కూడా కోరుకుంటున్నారు. మరి కర్ణాటకకు పెద్ద పీట వేసిన ఉక్కు మంత్రి విశాఖ దిక్కు వైపు చూస్తారా అన్నాదే చర్చగా ఉంది.

## ఆర్థిక రంగంలో పరుగులు పెట్టించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు ఘన నివాళి



శామీర్ పేట, (గరుడ వార్త) : దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ పరుగులు పెట్టించిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కు ప్రజలు ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలో ప్రధాన కూడలిలో మన్మోహన్ సింగ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. మన్మోహన్ సింగ్ 10 సంవత్సరాలుగా ప్రధానమంత్రిగా దేశానికి అందించిన సేవలను కొని ఆడారు. శామీర్ పేట మండలం తూముకుంట మున్సిపల్ లో మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటాన్ని పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవరశెట్టి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు టిఆర్ రవీందర్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, దుర్గయ్య, మల్లేష్ యాదవ్, బిక్షపతి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శామీర్ పేట మండలంలో....**అలాగే మండల కేంద్రం శామీర్ పేటలో కాంగ్రెస్ నాయకుడు మమ్మద్ అప్జల్ ఖాన్ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బోయిని బల్ రాం నా పి నరసింహారెడ్డి, మహమ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, బాబురావు, మహమ్మద్ హజ్మత్, ఉబెద్, అనిల్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. శామీర్ పేట మండలం మజీద్ పూర్ లో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు తుంకి రమేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, తుంకి బిక్షపతి, శ్రీకర్ రెడ్డి, తుంకి స్వామి, నర్సింగ్ రావు, లక్ష్మయ్య, పార్వతీనాథ్, వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**మూడు చింతలపల్లి మండలంలో....** మండల కేంద్రం మూడు చింతలపల్లిలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నల్ల గణేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి జగన్నాథం, దోసకాయల వెంకటేష్, కే నర్సింలు, ఎం వీరేశం, టి వేణుగోపాల్ రావు, జి బస్వా రెడ్డి, జెర్రిపోతుల నరసింహులు, లక్ష్మయ్య, వైద్యనాథ్, వి భూపాల్ రెడ్డి, టి వెంకటేష్, ఎస్ కృష్ణ, కే గోపి, కే లక్ష్మణ్, ఎం సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, బాబురావు, కే భానుచందర్, నర్సింలు, పాండు తదితరులు పాల్గొన్నారు.

## లియో అకాడమీలో ఫుడ్ పేస్ట్ పోటీలు



శామీర్ పేట, (గరుడ వార్త): లియో అకాడమీలో ఫుడ్ పేస్ట్ పోటీలు నిర్వహించారు. శామీర్ పేట మండలం బొమ్మ రాసిపేట పరిధిలోని లియో అకాడమీలో లియో అకాడమీ ఆఫ్ హాస్పిటాలిటీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో 2024 అకాడమీ క్యాంపస్‌లో పోటీలను నిర్వహించారు. తెలంగాణా జిల్లాల్లోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల నుంచి ఎంతో మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాకశాస్త్రంలో వారి ప్రతిభను ప్రదర్శిం చారు. వివిధ రకాల ఆహారాలు, స్వీట్లు, బ్రేక్-ఫాస్ట్‌లు, జ్యూస్‌లను సిద్ధం చేసి ప్రదర్శించారు. గజ్వేల్ లోని సాయి జీడిఆర్ హైస్కూల్, జ్ఞాన సరస్వతి జూనియర్ కళాశాలల కు మొదటి బహుమతి లభించగా, లియో ఒకేషనల్ జూనియర్ కళాశాల, సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల లలు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాయి జిడిఆర్ ఉన్నత పాఠశాలకు, మెదక్ సిద్ధార్థ మోడల్ హైస్కూల్‌లు తృతీయ బహుమతులను గెలుపొం దారు. డిస్ట్రిక్ట్ గ్రావిటీ అడ్వెంచర్ పార్క్ వోచర్లతో పాటు విద్యార్థులకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లియోనియా చెఫ్ రాజ్, తెలుగు అరోమా చెఫ్ శ్రీకాంత్, కోస్తా క్రూజ్‌లైన్స్‌కు చెందిన యోగేష్ పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు - పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



శామీర్ పేట, (గరుడ వార్త) : ఘనంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు. బుధవారం రాత్రి శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ లో పాస్టర్ డేవిడ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు.

పాస్టర్ డేవిడ్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ విచ్చేసి తదితర నాయకులతో కలసి క్రిస్మస్ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. క్రిస్టియన్ సమాజానికీ పవిత్ర క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు పిన్నింటి ధర్మారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సుతారిగూడెం దుర్గయ్య, పలువురు పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన శ్రీ విష్ణు శివాలయ ప్రాంగణం

శామీర్ పేట, డిసెంబర్ (గరుడ వార్త) : శ్రీ విష్ణు శివాలయంలో మాల ధరించిన స్వాముల అయ్యప్ప స్వామి నామస్మరణ తో ఆ ప్రాంతం మారు మోగింది. బుధవారం సాయంత్రం మూడు చింతలపల్లి మండలం ఉద్దమర్రి పరిధిలోని శ్రీ విష్ణు శివాలయం (అక్కన్న మాదన్న) నాటి దేవాలయం లోని అయ్యప్ప స్వామి సన్నిధానం లో కన్నె స్వాములు టేకుల మధుసూదన్ రెడ్డి, టేకుల హరివర్ధన్ రెడ్డి కన్నె స్వాములు అయ్యప్ప మహా పడి పూజను చంద్రమోహన్ శర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకము, అర్చన, మంత్రపుష్పం నిర్వహించారు. భక్తి గీతాలు ఆలపించి భజనలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో అయ్యప్ప స్వామి మాల ధారణ భక్తులు, అయ్యప్ప భక్తులు, శ్రీరామ భజన బృందం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## ఆలస్యం.. నిమిషం.. విషం..!

కోదాడ పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఈ నెల 18న గ్రూప్-3 మూడో పేపరు రాసేందుకు ఓ అభ్యర్థి నిమిషం ఆలస్యంగా వచ్చాడు. అధికారులు కేంద్రంలోకి పంపించలేదు. రెండు పేపర్లు రాశానని, మూడో పేపర్ రాస్తే ఉద్యోగం వచ్చే అవకాశం ఉందని అభ్యర్థి బతిమాలినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కన్నీరు పెట్టుకొని పరీక్ష కేంద్రం నుంచి వెనుదిరిగాడు. నిమిషం ఆలస్యంతో జీవిత ఆశయానికి దూరమయ్యాడు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో ఉండటం గమనార్హం..

ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే దశలో తుపాను ధాటికి పంట నష్టమైతే రైతుకు ఎంత దు:ఖం ఉంటుందో.. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా సంవత్సరాల పాటు రాత్రింబవళ్లు చదివి పరీక్ష కేంద్రానికి నిమిషం ఆలస్యంగా వెళ్లడంతో పరీక్ష రాయకపోతే అభ్యర్థి పరిస్థితి కూడా అలానే ఉంటుంది. సమయపాలన పాటించక నిర్లక్ష్యంతో కొందరు దూరమైతే, ప్రయాణంలో కలిగే అవాంతరాలతో మరికొందరు ఆలస్యమై వెనుదిరుగుతుంటారు. నెలల పాటు పుస్తకాలే లోకంగా చదివి నిమిషం ఆలస్యం కావడంతో పరీక్ష రాయని అభ్యర్థులను ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష కేంద్రాల వద్ద చూశాం. చదివేటప్పుడు ఉండే సహనం, ప్రణాళిక పరీక్ష కేంద్రాలకు వెళ్లేటప్పుడు ఉండకపోవడం ఆలోచించదగిన విషయం.



గ్రూప్-3 పరీక్షలు ఈ నెల 17న మొదలుకాగా మొదటి పేపర్ పరీక్ష రాసేందుకు జిల్లాల్లోని కోదాడ, సూర్యాపేట పట్టణాల్లోని సుమారు మూడు పరీక్ష కేంద్రాల్లో, ఒక్కో కేంద్రానికి నలుగురు అభ్యర్థులు నిర్ణీత సమయానికి రాలేదు. నిమిషం ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించలేదు.

**ప్రణాళిక వేసుకోవాలి..**

**సాంకేతికత వినియోగించాలి..**

అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లాలంటే రవాణా పరంగా ఎన్నో మార్గాలు ఉన్నాయి. ఇప్పుడున్న ఆధునిక యుగంలో పరీక్ష కేంద్రం ఎక్కడ ఉందో చరవాణిలో ముందు గుర్తించవచ్చు. అభ్యర్థి ఉన్న చోటు నుంచి కేంద్రానికి వెళ్లాలంటే ఎంత సమయం పడుతుందో ఆన్‌లైన్‌లో చూడవచ్చు. ప్రతి ఒక్కరికీ ద్విచక్ర వాహనాలు అందుబాటులో ఉన్నాయి. పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకునేలా ప్రయాణం కొనసాగిస్తే మార్గమధ్యలో ఏమైనా అవాంతరాలు ఎదురైనా.. సరైనా సమయానికే పరీక్ష కేంద్రానికి వెళ్లొచ్చు. ఇప్పటికైనా అభ్యర్థులు రాబోయే రోజుల్లో రాసే ప్రతి పరీక్షకు గంట ముందుగానే ప్రణాళికలు వేసుకుంటే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు. కోదాడ పట్టణంలోనే 10 మంది వరకు పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా వచ్చారంటే జిల్లా వ్యాప్తంగా ఆ సంఖ్య ఎంతో ఉంటుందో ఊహించొచ్చు.

**సమయ పాలన పాటించాలి**

**శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ కోదాడ**

పోటీ ప్రపంచంలో క్షణం కూడా ఎంతో విలువైంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు సమయం ఎంత విలువైందో తెలుసు. నిత్యం ఏం చదవాలో ప్రతి అభ్యర్థి ప్రణాళిక రూపొందించుకోవాలి. పరీక్ష కేంద్రం ఎక్కడ ఉందో ముందు రోజే గుర్తించి, దానికి తగట్టు రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలి.

## పామాయిల్ పరిశ్రమ నిర్మాణానికి పచ్చజెండా

అశ్వారావుపేట : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడో పామాయిల్ పరిశ్రమ నిర్మాణానికి టీజీ ఆయిల్‌ఫెడ్ శంకుస్థాపనకు రంగం సిద్ధం చేస్తోంది. ఖమ్మం జిల్లాలో తొలిపరిశ్రమగా వేంసూరు మండలం కల్లూరిగూడెంలో శంకుస్థాపనకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అందుకు సంబంధించి ప్రాథమిక నివేదిక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ భాషా వద్ద సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలోని అశ్వారావుపేటలో 30టన్నులు, అప్పారావుపేటలో 90టన్నుల సామర్థ్యంతో పామాయిల్ పరిశ్రమలున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.75లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతుండగా.. అందులో సుమారు 80వేల ఎకరాలు భద్రాద్రి జిల్లాలో, 30వేల ఎకరాలు ఖమ్మం జిల్లాలో ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లో మిగతా విస్తీర్ణం ఉంది. ప్రస్తుతం అశ్వారావుపేట, అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమల్లో ఆయిల్‌పాం గెలలు క్రషింగ్ జరుగుతున్నాయి. సిద్దిపేటలో నిర్మాణంలో ఉన్న పామాయిల్ పరిశ్రమ 2026 ఆగస్టు నాటికి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే 30వేల ఎకరాల్లో ఆయిల్‌పాం విస్తీర్ణం ఉండి, ఏటా 70వేల టన్నుల ఆయిల్‌పాం గెలలు ఉత్పత్తి వస్తోంది. ఖమ్మం జిల్లాలో సుమారు 50వేల టన్నులు సత్తుపల్లి, వేంసూరు మండలాల నుంచే వస్తున్నాయి. చాలా కాలంగా ప్రతిపాదనలో ఉన్న ఉమ్మడి జిల్లాలో మూడో పామాయిల్ పరిశ్రమ కల్లూరిగూడెంలో డిసెంబరు నెలలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గంటకు 60టన్నుల సామర్థ్యంతో గెలల క్రషింగ్‌తో పాటు సొంతంగా విద్యుత్తు కూడా ఉత్పత్తి చేసేలా నిర్మాణాల ఆకృతులు (డిజైన్) రూపొందిస్తున్నారు. సుమారు రూ.100కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ సొమ్మును అప్పారావుపేట పరిశ్రమకు ఏ విధంగా ఎన్‌డీబీ(నేషనల్ డైరీబోర్డు) తీసుకున్నారో అదే రీతిలో తీసుకోవాలని తలపెట్టినట్లు సమాచారం. గతేడాది మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గోపాలగిరిలో పామాయిల్ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన విస్తీర్ణం అంతగా పెరగకపోవడంతో పనుల్లో పురోగతి లేదు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా రైతులు ఆయిల్‌పాం గెలలను దమ్మపేట మండలం అప్పారావుపేట పరిశ్రమకు తెస్తున్నారు.

**పూర్తయిన స్థల సేకరణ!**కల్లూరిగూడెంలో పామాయిల్ పరిశ్రమ నిర్మాణానికి గ్రామ శివారులో 42ఎకరాలు మూడేళ్ల క్రితమే టీజీ ఆయిల్‌ఫెడ్ అధికారులు సేకరించి కొంతభాగం ఫెన్సింగ్ వేశారు. సత్తుపల్లి, వేంసూరు మండలాలతో పాటు పెనుబల్లి మండలాలకు అందుబాటులో ఉంటుందని ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. వ్యవసాయ, ఉద్యాన శాఖా మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టాక ఆయిల్‌పాం పరిశ్రమల నిర్మాణం, తోటల పెంపకంలో వేగం పెరిగింది. ఈ విషయంపై టీజీ ఆయిల్‌ఫెడ్ డీఓ బాలకృష్ణను వివరణ కోరగా.. డిసెంబరు నెలలో శంకుస్థాపన చేసే అవకాశాలున్నాయని తెలిపారు.

# ఆశల సాగుకు అన్నదాతల ఎదురుచూపు

కడెం: వానాకాలం పంట సాగు పూర్తయింది. వరి కోతలు పూర్తిచేసి పంటను విక్రయించుకున్న రైతులు రెండో పంట సాగు కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విత్తనాలను సిద్ధం చేసుకున్న అన్నదాతలు సదర్‌మాట్, కడెం కాలువలకు నీటిని ఎప్పుడు విడుదల చేస్తారో అధికారులు ప్రకటన చేయకపోవడంతో ఎదురుచూస్తున్నారు. ఎగువన ఎస్సారెస్పీలో ఆశాజనకంగానే నీటిమట్టం ఉండటంతో సదర్‌మాట్ కాలువకు నీరిస్తారనే ఆశలో ఉన్నారు.

**తొందరగా వదిలితే మేలు**

యాసంగి పంటకోసం సాగునీటిని త్వరగా వదలాలని సదర్‌మాట్ రైతులు కోరుతున్నారు. ఆలస్యం చేస్తే పంట సాగులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెబుతున్నారు. సదర్‌మాట్ కాలువ కింద కడెం, ఖానాపూర్ మండలాల్లోని సుమారు 15 వేల ఎకరాల్లో పంట సాగవుతుంది. యాసంగికి ఆ మేరకు నీరిస్తారా, తక్కువగా ఇస్తారా, ఆరుతడి పంటలు, వారబందీ అంటూ మెలికలు పెడతారా అని రైతులు అయోమయంలో ఉన్నారు. కడెం మండలం లింగాపూర్ నుంచి చివరి ఆయకట్టు పెద్దూరు వరకు కాలువకు నీరొస్తుందనే నమ్మకంతో నారుపోసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కడెం కిందా అంతే..కడెం జలాశయలో నీటిమట్టం యాసంగి పంటకు ఇచ్చేంతగా



ఉన్నా అధికారులు ఇంకా విడుదల చేయడం లేదు. వానాకాలం పంటకోతలు ముగిసి రైతులు యాసంగి సాగుకోసం చూస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 700 అడుగులు కాగా ప్రస్తుతం 695 అడుగుల వద్ద నీటిమట్టం ఉంది. ఉన్న నీటిని జన్నారం మండలం వరకు సుమారు 25 వేల ఎకరాలకు నీరిచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. అధికారులు ఇప్పటికీ ఆయకట్టు రైతులు, నాయకులతో సమావేశం నిర్వహించకపోవడం, నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**త్వరలోనే సమావేశం**

కడెం కాలువలకు యాసంగి సాగుకు నీటి విడుదలపై త్వరలోనే సమావేశం నిర్వహిస్తాం. అనంతరం నీటి విడుదల ఉంటుంది. సదర్‌మాట్ కాలువ ద్వారా జనవరి మొదటి వారంలో విడుదల చేసే అవకాశం ఉంది. నవీన్, డీఈఈ కడెం ప్రాజెక్టు

# ఇక్కడ కబ్జా నిరంతర ప్రక్రియ

ఆసిఫాబాద్ : వందలాది ఎకరాల సర్‌సిల్క్ పరిశ్రమకు సంబంధించిన స్థలాలన్నీ అన్యాక్రాంతమైపోతున్నాయి. ఇదో నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. పంచాయతీ, పుర అధికారులు కాసుల కక్కుర్తితో ఇంటి నంబర్లను జారీ చేయడంతో నేడు ఆక్రమించిన స్థలం భారీ భవనాలకు నిలయంగా మారుతుంది. ఇంటి నంబర్లతో ఏకంగా రిజిస్ట్రేషన్లు సైతం జరిగిపోతున్నాయి. ఈ కబ్జాలపర్వంలో నేతలు సైతం ఉన్నారు. కొన్ని చోట్ల చిన్నపాటి గుడిసెలు వేస్తూ అనంతరం భారీ నిర్మాణాలను పూర్తి చేస్తున్నారు. పురపాలిక కేంద్రంలో ఈ విధంగా జరుగుతున్నా.. సంబంధిత అధికారులు ఇటువైపు చూడటం లేదు. కోర్టు పరిధిలో ఉన్నా, ఈ స్థలం పరాధీనం అవుతున్నా.. అధికారులు నిలువరించలేకపోతున్నారు. ఇలాగైతే సెంటు స్థలం సైతం సర్‌సిల్క్ పరిశ్రమకు మిగలదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కాగజ్‌నగర్ పట్టణంలో 1991 సంవత్సరంలో సర్‌సిల్క్ పరిశ్రమ మూతపడింది. ఈ మిల్లు పరిధిలో 778 ఎకరాల స్థలం పట్టణంతోపాటు కోసిని, చింతగూడ, ఈస్‌గాం, బురదగూడ, వంజీరి గ్రామాల సమీపంలో ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో ఈ భూములన్నీ హైకోర్టు పరిధిలో వెళ్లాయి. హైకోర్టు లిక్విడేటర్ 456



ఎకరాలకు 2009లో వేలం వేశారు. సర్వే నంబరు 69 నుంచి 117 వరకు 182 ఎకరాలను వరంగల్‌కు చెందిన వెంకటరమణ కొనుగోలు చేయగా 2011లో రిజిస్ట్రేషన్ సైతం జరిగింది. సర్వే చేసి సంబంధిత అధికారులు ఇవ్వకపోవడంతో ఆయన భూమిని తీసుకోలేదు. మరోవైపు ఈ భూమి పూర్తిగా అక్రమార్కుల చేతిలో ప్లాట్లు, భవనాలుగా రూపొందుతోంది. వెంకటరమణ భూములతోపాటు మిగతా సర్‌సిల్క్ భూములన్నింటినీ చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతిపక్షం, అధికారపక్షం అనే భేదం లేకుండా వీలైనంత ఆక్రమించుకున్నారు.

**కాపాడే బాధ్యత ఎవరిది?**

చోటా, మోటా నేతలతోపాటు పెద్ద నాయకులు సైతం అప్పనంగా వచ్చే భూమిపై కన్నేసి క్రయవిక్రయాలకు పాల్పడుతున్నారు. హైకోర్టు లిక్విడేటర్ పరిధిలో ఈ భూములను కాపాడే బాధ్యత జిల్లా పాలనాధికారిదే. ఇప్పటికే కట్టుకున్న భవనాలు అటుంచింతే కనీసం ఖాళీ ప్రదేశాలనైనా సంరక్షించే బాధ్యతను ఇప్పటికైనా అధికారులు తీసుకోవాలి. లేకపోతే పైసా పైసా కూడపెట్టి ఏ భూమో తెలియకుండా కొనుగోలు చేసిన సామాన్యులు నిండా మునిగే ప్రమాదం పొంచి ఉంది. ఇంటి నంబర్ల జారీని నిలిపివేస్తే కబ్జాలకు అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు ఉన్నాయి.

**పైసలు పెడితే ఇంటి నంబరు**

రూ.5 వేల నుంచి రూ.10 వేలు చెల్లిస్తే పుర అధికారులు ఇంటి నంబర్లు ఇస్తున్నారు. హైకోర్టు పరిధిలో ఉన్న స్థలాలకు ఇంటి నంబర్లు ఇవ్వడం, రిజిస్ట్రేషన్‌లు చేయడం నిషేధం. అయినా ఇప్పటి వరకు పుర అధికారులు 320కిపైగా, పంచాయతీ అధికారులు 210 వరకు ఇంటి నంబర్లు జారీ చేశారు. బాండ్‌పేపర్లు, తెల్లకాగితాలపై రాసుకుని కొనుగోలు చేస్తున్నారు. పట్టానా, ప్రభుత్వ భూమా అనేదేమీ చూడకుండా ఇంటి నంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్‌లు సైతం జరుగుతున్నాయి. వెంకటరమణ కొనుగోలు చేసిన 182 ఎకరాల్లో ప్రస్తుతం కేవలం 15 ఎకరాలు మాత్రమే ఉండగా ఈ స్థలంలోనూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఇప్పటి వరకు సర్‌సిల్క్ స్థలాలపై రూ.200 కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్లు సమాచారం.

# పాలేరుకు మున్నేరు వరద నీరు



ఖమ్మం: సముద్రం పాలవుతున్న మున్నేరు వరద నీటిని పాలేరు జలాశయానికి మళ్లిస్తే జిల్లాలో సాగర్ ఆయకట్టుకు సమృద్ధిగా నీరందించవచ్చనే లక్ష్యంతో ప్రతిపాదించిన 'మున్నేరు–పాలేరు' వరద కాల్వ తవ్వకానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా నీటిపారుదలశాఖ ఇంజినీర్ల సమావేశంలో మంత్రులిద్దరూ సుముఖత వ్యక్తం చేశారు. అందుకు సంబంధించిన డీపీఆర్‌ను నివేదించాల్సిందిగా జిల్లా నీటిపారుదల శాఖ ఇంజినీర్లకు ఆదేశించారు.

**సీతారామ కాల్వకు లింక్ కెనాల్ అనుసంధానం..**

గోదావరి జలాలను పాలేరు జలాశయానికి తరలించే క్రమంలో ఏన్కూరు ప్రాంతం నుంచి పాలేరు లింక్ కెనాల్ పనులు సాగుతున్నాయి. ఈ కాల్వ పాలేరు జలాశయం వరకు 74 కిమీ తవ్వకం జరుగుతుండగా, గార్ల మండలంలోని పుల్లూరు సమీపంలో 37వ కిమీ వద్ద మున్నేరు వరద కాల్వను అనుసంధానించాలనేది ప్రతిపాదన. ఇదే మండలంలోని మద్దివంచ ప్రాంతంలోని చెక్‌డ్యాం నుంచి 9.5 కిమీ వరద కాల్వ తవ్వి ఇక్కడ అనుసంధానించనున్నారు. దీంతో మున్నేరు వరద నుంచి కనీసం 6 వేల క్యూసెక్కుల నీటిని మళ్లించే అవకాశాన్ని అధికారులు అంచనా వేశారు. మున్నేరు నుంచి వరద కాల్వ ప్రారంభమయ్యే మద్దివంచ ప్రాంతం నుంచి వరద మళ్లింపు కాల్వ లింక్ కెనాల్‌లో కలిపే పుల్లూరు ప్రాంతం నాలుగు మీటర్ల లోతట్టుగా ఉండటంతో వరద నీరు గ్రావిటీ ద్వారానే పాలేరు లింక్ కెనాల్‌కు చేరనుంది. మున్నేరు ఏటా కనీసం 30 నుంచి 45 రోజుల పాటు పూర్తిస్థాయిలో ప్రవహిస్తుందనే అంచనా ఉండగా, ఈ సమయంలో వరద నీటిని పాలేరుకు మళ్లిస్తే కనీసం 20 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చని అంచనా వేశారు.

**రూ.110 కోట్లతో తవ్వకం..**

కేవలం రూ.110 కోట్ల వ్యయంతో మునేరు నుంచి వృథా అయ్యే నీటిని పాలేరుకు మళ్లించవచ్చేనే ప్రతిపాదన ఉండగా మంత్రులు అందుకు సుముఖత వ్యక్తం చేశారు. కాల్వ తవ్వకానికి ప్రభుత్వ భూములతో పాటు, సుమారు 200 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. ఇందుకు మరో రూ.30 కోట్లు అవసరమని అంచనా వేశారు.

**డీపీఆర్ రూపొందించాలని ఆదేశం**

ఖమ్మం సీఈ విద్యాసాగర్, ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, డీఈఈ బానాల రమేష్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను, కాల్వతో కలిగే ప్రయోజనాలను మంత్రులకు వివరించారు. డీపీఆర్‌ను సిద్ధం చేయమని మంత్రులు అధికారులకు సూచించారు. డీపీఆర్ సమర్పించిన అనంతరం తదుపరి ప్రక్రియ చేపడతామని మంత్రులు అధికారులకు హామీ ఇచ్చారు.

ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ప్రజలకు వరద ముప్పు నుంచి శాశ్వత విముక్తి కల్పించేలా మున్నేరు నదికి రెండు వైపులా కరకట్టలు యుద్ధప్రాతిపదికన నిర్మించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. దృఢమైన కాంక్రీట్ గోడలు నిర్మించేందుకు అవసరమైన డిజైన్స్ రూపొందించాలన్నారు. పనుల పురోగతిని ప్రతి నెలలో రెండుసార్లు తాను స్వయంగా పర్యవేక్షిస్తానని చెప్పారు.

# ఏళ్ల తరబడి నిరీక్షణకు తెర




ఖమ్మం : అర్హులైన పేదలకు కొత్తగా రేషన్‌కార్డులు అందించేందుకు సర్కారు ప్రణాళికలు రచిస్తోంది. సంక్రాంతి పండగ నాటికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను కొలిక్కి తెచ్చి ఆతర్వాత లబ్ధిదారులకు కార్డులు అందించేందుకు పౌరసరఫరాలశాఖ సిద్ధమవుతోంది. ఇందుకోసం ఆదాయ పరిమితి, ఇతర అర్హతలపై కసరత్తు చేస్తున్న సర్కారు.. సోమవారం నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో కొత్త కార్డుల జారీకి సంబంధించి మార్గదర్శకాలు రూపొందించనున్నట్లు తెలిసింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని నిరుపేదల్లో రేషన్ కార్డుల ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డుల కోసం అందిన దరఖాస్తులు అధికారుల వద్ద ఉండగా.. మరోసారి అర్జీలు స్వీకరించాక కొత్త కార్డులు జారీచేయనున్నారు.

**ఉభయ జిల్లాల్లో 90,757 దరఖాస్తులు**

రాష్ట్ర ఆవిర్భావం నుంచి కొత్త రేషన్‌కార్డులు జారీ కాలేదు. 2025 సంక్రాంతి నుంచి కార్డులను జారీ చేయనున్నట్లు సర్కారు ఇటీవల ప్రకటించటంతో ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారితోపాటు కొత్తగా అర్జీలు పెట్టుకునేవారూ ఆశగా ఎదురుచూస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ప్రస్తుతం 7,01,410 రేషన్ కార్డుల్లో 19,67,634 మంది లబ్ధిదారులుగా ఉన్నారు. గత పదేళ్లలో రేషన్ కార్డులు అందకపోవటంతో కొంతమంది అర్హులు ప్రభుత్వ పథకాలకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. ఉభయ జిల్లాల్లో 90,757 అర్జీలు పౌరసరఫరాలశాఖ అధికారులకు చేరాయి. తాజాగా సంక్రాంతి నుంచి కొత్త కార్డులను జారీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించటంతో మరోసారి అర్జీలు స్వీకరించే అవకాశాలున్నాయి. జిల్లాల వారీగా వారం పాటు ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించి.. ఆతర్వాత లబ్ధిదారు లను గుర్తించనున్నట్లు తెలిసింది. ఈ ప్రక్రియ కోసం అవసరమైన మార్గదర్శకాలు జనవరి మొదటి వారానికి కొలిక్కి రానున్నాయి. కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది. మార్గదర్శకాలు అందిన వెంటనే కొత్త రేషన్ కార్డుల జారీకి అవసరమైన చర్యలు తీసుకుంటాం. చందన్‌కుమార్, డీఎస్ఓ, ఖమ్మం

# సత్తువ లేని బాల్యం

ఖమ్మం : రక్తహీనత చెరలో బాల్యం బందీ అవుతోంది. శరీరంలో ఐరన్ లోపం ఉంటే.. రక్తహీనత(ఎనీమియా) సమస్యకు దారితీస్తుంది. శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయి తక్కువగా ఉండటంతో ఆక్సిజన్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా పిల్లల ఎదుగుదల మందగిస్తుంది. బరువు పెరగటం నెమ్మదించి పాక్షిక లేదా పూర్తిస్థాయిలో శారీరకంగా, మానసికంగా అభివృద్ధి లోపం కనిపిస్తుంది. నీరసం, అలసట వల్ల పిల్లల్లో ఆటలాడటానికి, సాధారణ పనులు చేయటానికి శక్తి సరిపోని పరిస్థితులు ఎదురవుతాయి. ఇలాంటి సమస్యలతో బాధపడేవారు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 19వేల మందికిపైగా ఉన్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



**పోషకాహారమే ఔషధం**

బాలికలను రక్తహీనత వెంటాడుతోంది. వారిలోనే పోషకాహార లోపం ఎక్కువగా కనిపిస్తోంది. నీరసం, నిస్సత్తువ, ఆయాసంతో చదువులపై దృష్టిసారించలేకపోతున్నారు. ఇది వారి ఎదుగుదల, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రక్తహీనతతో బాధపడుతున్న వారిలో ఖమ్మం జిల్లాలో బాలికలు 6,222 మంది, బాలురు 4,867 మంది, భద్రాద్రి జిల్లాలో బాలికలు 4,642 మంది, బాలురు 2,741 మంది ఉన్నారు. రక్తహీనత నివారణకు ఐరన్ శాతం అధికంగా ఉండే ఆహారాన్ని పిల్లలకు ఇవ్వాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఆకుకూరలు, గుడ్లు, పాలు, చికెన్, డ్రైఫ్రూట్స్ వంటి వాటితో పాటు విటమిన్–సి అధికంగా గల ఆహార పదార్థాలను పిల్లల డైట్‌లో ఉండేలా చూడాలంటున్నారు. భావితరాలు రక్తహీనత సమస్యను ఎదుర్కోకుండా నివారించేందుకు గర్భిణులు పోషకాహారం తీసుకోవటమే ఏకైక మార్గమని స్పష్టం చేస్తున్నారు.

**ఖమ్మంలో 65%.. భద్రాద్రిలో 57%**

పిల్లల్లో రక్తహీనత నివారణకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ 'ఎనీమియా ముక్త్ తెలంగాణ' కార్యక్రమాన్ని చేపట్టింది. ఒక్కో జిల్లాకు 12 బృందాలను నియమించింది. ఈ బృందాలు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అన్ని పాఠశాలల్లో 5, 6, 7 తరగతుల విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు జరుపుతున్నాయి. నవంబర్ 4 నుంచి డిసెంబర్ 23 వరకు ఖమ్మం జిల్లాలో 17,517 మందికి రక్తహీనత పరీక్షలు నిర్వహించగా 11,438 (65శాతం) మందికి 100 గ్రాముల రక్తంలో 12 గ్రాముల హిమోగ్లోబిన్ కంటే తక్కువగా ఉన్నట్లు తేలింది. భద్రాద్రి జిల్లాలో 13,431 మందికి పరీక్షలు జరపగా 7,660 (57శాతం) మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయ్యింది. ప్రతి 100 గ్రాముల రక్తంలో 8 గ్రాముల కంటే తక్కువగా హిమోగ్లోబిన్ ఉన్నట్లయితే తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నారని అర్థం. ఈలెక్కన ఖమ్మం జిల్లాలో 11,438 మంది వివిధ స్థాయిల్లో ఎనీమియాతో బాధపడుతుండగా.. అందులో 878 (బాలికలు–570, బాలురు–308) మంది తీవ్ర రక్తహీనత కలిగి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. భద్రాద్రి జిల్లాలో 7,660 మంది ఎనీమియాతో సతమతమవుతుండగా 151(బాలికలు–80, బాలురు–71) మంది విద్యార్థులు తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్నట్లు తేల్చారు.

రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఎనీమియా స్థాయిని బట్టి ఐరన్ మాత్రలు అందిస్తున్నాం. రెండు నెలలకోసారి పరీక్షలు నిర్వహించి పిల్లల్లో రక్తహీనత స్థాయిని గుర్తించి తగిన ఔషధాలు, ఆహారం అందించేలా చర్యలు చేపడుతున్నాం. నులిపురుగు నివారణ కార్యక్రమాలు చేపడుతున్నాం. డా.చందునాయక్, ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త, ఖమ్మం

# కుట్టు కూలీ ఏది సారు..?

చెన్నూరు : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టిన మహిళలు కూలీ డబ్బుల కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది దుస్తులు కుట్టే బాధ్యతను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం అప్పగించింది. అయితే జులైలో మొదటి విడత దుస్తులు కుట్టి ఇవ్వగా.. సెప్టెంబరు నెలలోనే నగదు జమ చేశారు. రెండో విడత దుస్తులను కుట్టి అందించినా.. ఇప్పటివరకు కూలీ డబ్బులు అందించలేదు. దీంతో డబ్బుల కోసం మహిళలు ఎదురు చూస్తున్నారు.జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు–511, ప్రాథమికోన్నత–97, ఉన్నత–109, కేజీబీవీ–18, ఆదర్శ పాఠశాలలు–05 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో చదువుతున్న మొత్తం 43,714 మంది విద్యార్థులకు రెండు జతల దుస్తులను అందించాలి. మొదటి విడతగా 43,714 దుస్తులను కుట్టి అందించగా ఒక్కో జతకు రూ.50 చొప్పున రూ.21,85,700లను అందజేశారు. రెండోవిడత దుస్తులను సెప్టెంబరులోనే



కుట్టి ఇచ్చినా.. ఇంతవరకు నగదు జమకాలేదు. కూలీ ధర గిట్టుబాటు కాకున్నా దుస్తులను కుట్టి ఇచ్చినా డబ్బులు ఇప్పటికీ ఇవ్వకపోవడంపై మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పెంచిన కూలీ ధర ప్రకారం ఒక్కో జతకు రూ.75 చొప్పున రూ.32.78 లక్షలు మహిళల ఖాతాల్లో నగదు జమ కావాల్సి ఉంది.

**పత్తాలేని పెంచిన కూలీ డబ్బులు..**

ఏకరూప దుస్తులు కుట్టిన వారికి గతంలో రూ.50 చొప్పున అందించారు. ఈ కూలీ ధర గిట్టుబాటు కాదని, దుస్తులు కుట్టలేమని మహిళలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఒక్కో జతకు రూ.25పెంచి రూ.75 చొప్పున అందిస్తామని విద్యాశాఖ ప్రకటించింది.. కుట్టు కూలీ ధర పెంపుపై జూన్‌లోనే ప్రభుత్వ ఉత్తర్వులు సైతం వెలువడ్డాయి. మొదటి విడత జతకు రూ.50 ఇచ్చారని, పెంచిన రూ.25తో పాటు రెండో విడత జతకు రూ.75చొప్పున కూలీ డబ్బులను జమ చేయాలని మహిళలు కోరుతున్నారు.

**నిధులు మంజూరుకాగానే జమచేస్తాం**

మొదటి విడతగా మంజూరైన డబ్బులను మహిళల ఖాతాల్లో జమయ్యాయి. రెండోవిడత డబ్బులు ఇంకా రాలేదు. మంజూరు కాగానే వెంటనే వారి ఖాతాల్లో జమ చేస్తాం.. ప్రభుత్వం అందించిన ప్రకారమే కుట్టు కూలీ డబ్బులు ఇస్తాం.యాదయ్య, జిల్లా విద్యాధికారి, మంచిర్యాల


# అనువైన స్థలం..కాపాడితే ఫలం

బెల్లంపల్లి: నెన్నెల మండలంలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కానీ అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో అన్యాక్రాంతమవుతోంది. మారుమూల మండలంలో సమీకృత గురుకులం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఈ స్థలాన్ని కేటాయించవచ్చు. ఇలాచేస్తే ప్రభుత్వ భూమిని కాపాడటంతో పాటు మారుమూల మండలం అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి.

నెన్నెల మండల శివారులోని 671, 672 సర్వే నంబరులో రెండు వేల ఎకరాల భూమి ఉంది. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదాస్పదం కావడంతో వందల ఎకరాల భూమి కబ్జాదార్ల పాలవుతోంది. వివాదం ఉండగానే రెవెన్యూ శాఖ పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాలకు ఇప్పటికే 30 ఎకరాలు కేటాయించింది. ఇలా కేటాయిస్తే ప్రభుత్వ కార్యాలయాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ప్రస్తుతం సమీకృత గురుకులం, సౌర ప్లాంట్లు, ఇతర పరిశ్రమలకు కేటాయించాల్సిన అవసరముంది.

**కార్యాలయాలకు స్థలం లేక..**

మండల స్థాయిలో కార్యాలయాలకు స్థలాలు లేవు. ఇప్పటికే పశు వైద్యశాల, భవనం, గ్రంథాలయం, గిడ్డంగుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వీటికి స్థలం చూపించకపోవడంతో నిధులు వెనక్కి మళ్లాయి. అయితే మండలంలో చాలా విలువైన ప్రభుత్వ భూమి ఉ



ంది. ఇది ఆక్రమణదార్లపరం కాకముందే వాటికి కేటాయిస్తే కార్యాలయాలు నిర్మించవచ్చు. మారుమూల ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుందని మండలవాసులు కోరుతున్నారు.

**శాఖలమధ్య సమన్వయం అవసరం**

అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదం కొనసాగుతోంది. దీంతో అక్కడున్న భూమి కబ్జాలకు గురవుతోంది. రెండు శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో అసలు ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. చాలా మందికి కేటాయించిన పట్టాలు బి కేటగిరిలో ఉంచారు. అయినప్పటికీ 500 ఎకరాలు అన్యాక్రాంతమైంది. కనీసం మిగిలిన భూమి ప్రభుత్వ కార్యాలయాలు విద్యాసంస్థలకు కేటాయించి సద్వినియోగం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం..**

నెన్నెల శివారులోని ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ ప్రభుత్వ సంస్థల కోసం స్థలాన్ని కేటాయించేందుకు పరిశీలిస్తున్నాం. హరికృష్ణ, ఆర్డీవో, బెల్లంపల్లి

# పెరిగిన జలం... సాగుకు అనుకూలం

నల్గొండ :భూగర్భజలం పెరుగుతోంది. గతేడాదితో పోల్చితే ఈసారి 1.53 మీటర్లు భూగర్భజలం పైన ఉంది. గత నవంబరులో 7.68 మీటర్ల లోతులో ఉండగా తాజాగా 6.16 మీటర్ల పైకి వచ్చింది. వానాకాలం పైర్లు పూర్తవడంతో గత నెలలో సాగుకు నీరు అంతగా వినియోగంలో లేదు. దీంతో గతనెల కన్న నవంబరులో 0.10 మీటర్ల పైకి నీటి మట్టం పెరిగింది. ప్రాజెక్టుల్లో నీరు సమృద్ధిగా ఉండటం.. జలం పెరగడంతో యాసంగి సీజన్‌పై రైతులకు భరోసా లభించింది. చెరువులు, కుంటలు నీటితో నిండి ఉన్నాయి. ప్రస్తుతం జిల్లా సగటు భూగర్భజల మట్టం 6.15 మీటర్ల పైన ఉంది.

# ఒకటి నుంచి నుమాయిష్..
# విస్తృత ఏర్పాట్లతో జోష్

అబిడ్స్ : జనవరి ఒకటి నుంచి ప్రారంభమయ్యే 'నుమాయిష్'కు నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఏటా 46 రోజుల పాటు అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) నిర్వహిస్తారు. 84వ ప్రదర్శనకు ఇప్పటికే స్టాళ్ల కేటాయింపు పూర్తయ్యింది.

**రెండు వేలకు పైగా స్టాళ్లు..** జంట నగరాలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 'నుమాయిష్' తిలకించేందుకు ఏటా సుమారు 20 లక్షల నుంచి 22 లక్షల మంది సందర్శకులు వస్తున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లపై పోలీసు, ట్రాఫిక్, ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, జలమండలి, ట్రాన్స్‌కో, అగ్నిమాపకశాఖ తదితర విభాగాల అధికారులు సమీక్షించారు. ఈ సంవత్సరం సుమారు 2000లకు పైగా స్టాళ్లు కొలువుదీరనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు చెందిన స్టాళ్లతో పాటు ప్రైవేటు రంగ సంస్థల స్టాళ్లు కూడా ఏర్పాటు అవుతున్నాయి. శాంతిభద్రతలు, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఏర్పాట్లు ఇలా.. ఎగ్జిబిషన్ మైదానంలో దుమ్ము ధూళి రేగకుండా అవసరమైన ప్రదేశాల్లో టైల్స్ నిర్మాణం



చేపట్టారు. రౌండ్ స్టాళ్లకు బదులు సందర్శకుల సౌకర్యార్థం ఈ సారి ప్రయోగాత్మకంగా స్క్వేర్ స్టాళ్లకు శ్రీకారం చుట్టారు. యశోద ఆసుపత్రి సహకారంతో 24 గంటలు పనిచేసేలా ఆసుపత్రి ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు అంబులెన్సులు సిద్ధంగా ఉంచుతున్నారు. మొబైల్ ఏటీఎంలు, సెల్ టవర్లు, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పిస్తున్నారు.

**115 సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు: బి.సురేందర్‌రెడ్డి, సొసైటీ కార్యదర్శి**

'వాచ్ టవర్'తో పాటు సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నాం. ఇంటర్నల్ సెక్యూరిటీ ఏర్పాట్లు చేస్తున్నాం. 115 సీసీ టీవీ కెమెరాలు ఉంటాయి. 'కొబ్బరి నీరు' స్టాల్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. ప్రారంభోత్సవానికి సీఎంను ఆహ్వానించాం.

# వ్యర్థాల శుద్ధీకరణ లేనట్లేనా?

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ, స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా 30 నెలల కిందట రూ.16.50 కోట్లతో ప్రారంభించిన బయోమైనింగ్ ప్రక్రియ మూత పడినట్లుగానే తెలుస్తోంది. ఏడాదిలోగా డంపింగ్‌యార్డు పూర్తిగా శుభ్రం చేసి ఇవ్వాల్సి ఉండగా ఎప్పుడో గడువు ముగిసింది. పలుమార్లు ఏజెన్సీకి నోటీసు ఇవ్వడంతో అప్పుడప్పుడు ప్రారంభించి పత్తా లేకుండా పోతున్నారు. ఈ ఏజెన్సీకి బిల్లులు ఇవ్వకపోవడం ప్రధాన కారణమంటున్నారు. ఈ నేపథ్యంలో ఇళ్ల నుంచి సేకరిస్తున్న చెత్త గుట్టలుగా పేరుకుపోతుంది. పేర్చుకుంటూ పోవడం తప్ప ప్రత్యామ్నాయ చర్యలు ఏవీ లేకపోవడంతో నగరానికి చెత్త నిల్వలు సవాల్‌గా మారాయి.

**డంపింగ్‌యార్డులో తగ్గని పొగ**

డంపింగ్‌యార్డులో వేసవి రాకముందే మంటలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటి నుంచే మంటలు వస్తుండటంతో ఆయా




ప్రాంతవాసులు ఉలిక్కిపడుతున్నారు. ఇటీవల ఎల్లమ్మగుడి వైపు, మానేరు వాగు వైపు చెత్తా అంటుకుంది. ఈదురుగాలులు వీస్తుండటంతో మంటలు వస్తున్నాయి. మంటలు అధికమైతే చాలు బల్దియా ట్యాంకర్లు, అగ్నిమాపక యంత్రం ద్వారా నీటితో పట్టాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే ఇప్పటికీ అప్పుడప్పుడు వంతెన వైపు పొగ వస్తూనే ఉంది. అలుగునూర్, కోతిరాంపూర్, రామగుండం బైపాసు రోడ్డులో పొగ, వాసన వస్తుండటంతో రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాత్కాలిక చర్యలు తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడంలేదు. బయోమైనింగ్ పనులు తిరిగి ప్రారంభించాలని నోటీసు ఇచ్చామని పారిశుద్ధ్య విభాగం అధికారి తెలిపారు. స్థలం కావాలని పాలనాధికారికి లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

**ఆకులతో అంటుకుంటున్న మంటలు**

నగరంలో విద్యుత్తు తీగలకు తగులుతున్న చెట్లు, కొమ్మలను కొడుతుండటం, అదంతా తీసుకొచ్చి డంపింగ్‌యార్డులో పడేస్తున్నారు. ఆకులు, కొమ్మలు ఎండిపోయి త్వరగా మంటలు వస్తున్నట్లుగా కార్మికులు అంటున్నారు. ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు తీసుకొచ్చి వేస్తున్నారు. ఇలాంటి వ్యర్థాలు డంపింగ్‌యార్డులో ఎక్కువయ్యాయి.

# కొలిక్కిరాని శాశ్వత రహదారి పనులు

రామడుగు: రామడుగు శివారు మోతె వాగు వంతెన పనుల్లో అడుగు ముందుకు పడటంలేదు. కొత్త వంతెనకు ఇరువైపులా శాశ్వత రహదారి నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు పరిహారం ఇవ్వకపోవడంతో భూనిర్వాసిత రైతులు ఒప్పుకోలేదు. గత నెల 29న రూ.1,54,73,000 పరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ పరిపాలనా పరమైన ఆలస్యం కావడంతో పరిహారం అందక రైతులు ఎదురుచూస్తున్నారు. మరో వైపు గుత్తేదారు పనులు చేపట్టేందుకు తన పొక్లెయిన్‌ను వంతెన వద్దకు తరలించారు. కానీ అధికారుల



నుంచి పరిహారం చెల్లింపుపై స్పష్టమైన సమాచారం లేక రైతులు రోడ్డు పనులు నిలిపివేశారు. రామడుగు, గంగాధర, పెగడపల్లి, గొల్లపల్లి మండలాలకు చెందిన 60 గ్రామాల ప్రజలు ఈ వంతెనపై నుంచి కరీంనగర్ వెళ్తుంటారు. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే వంతెన ఈ ప్రాంతంలో రాకపోకలకు కీలకంగా మారింది. కొత్త వంతెన నిర్మాణం పనులకు గత సెప్టెంబరులో రూ.11.20 కోట్లతో సవరణ ప్రతిపాదనలు చేశారు. ఈ వంతెనకు ఇరువైపులా తాత్కాలికంగా పోసిన మట్టితో దుమ్ము వ్యాపిస్తోంది. దీనికితోడు గుంతలు పెరిగి వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిహారం చెల్లించి తారు రోడ్డు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# నోరు విప్పు.. అవినీతి తప్పు!



తాండూరు : జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి యథేచ్ఛగా సాగిపోతోంది. ఎవరైనా చొరవ చూపి ఫిర్యాదుచేస్తేనో, ఆకస్మిక దాడులవల్లో అవినీతి వెలుగుచూస్తోంది. ముఖ్యంగా ఈ వ్యవహారం రెవెన్యూ, పోలీస్, విద్యుత్తు, గనులు, పురపాలిక, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆచారంగా మారింది. తాజాగా సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వెలుగుచూసిన అవినీతి ఘటన మరోసారి చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో కథనం. 2023లో తాండూరు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన జమీరొద్దీన్ రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. తహసీల్దారు కార్యాలయాల్లోనూ..తహసీల్దారు కార్యాలయాల్లోనూ అవినీతి నిరంతరాయంగా సాగుతోంది.

నాలుగేళ్ల కిందట పెద్దేముల్ తహసీల్దారు రామహరి ప్రసాద్ మంబాపూర్ నివాసి భూమిని పట్టా చేయడానికి డబ్బులు డిమాండ్ చేశారు. అతను ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో తహసీల్దారుకు డబ్బులు ఇస్తుండగా పట్టుకున్నారు. 2013లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను యాలాల తహసీల్దారు చిన్నప్పలనాయుడు పట్టుకోగా సదరు యజమాని కోర్టునుంచి రిలీజ్ ఆర్డర్ తెచ్చారు. ఇందుకోసం అటెండర్ రూ.15వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. విచారణలో తహసీల్దారు పేరు చెప్పాడు.

**ఇసుక దందా.. పోలీసులకు వరం**

కాగ్నా, కాకర వేణి నదుల ఆధారంగా జరుగుతున్న ఇసుక దందా పోలీసులకు వరంలా మారింది. గతంలో పెద్దేముల్ ఎస్సైగా పనిచేసిన చంద్రశేఖర్ ఇసుక ట్రాక్టర్‌ను విడుదల చేయడంలో డబ్బు తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.

యాలాల పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన కానిస్టేబుల్ ఇసుక దందా నిర్వహించే వ్యక్తి వద్ద డబ్బులు వసూలు చేస్తూ ఏసీబీకి దొరికాడు.

విద్యుత్తు శాఖలో మూడేళ్ల కిందట నిబంధనల మేరకు మీటరు ఇవ్వాలని కోరిన తాండూరు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి నుంచి ఏడీగా పనిచేసి రాందాసు డబ్బులు డిమాండ్ చేశాడు. ఆ వ్యక్తి కింది స్థాయి సిబ్బందికి డబ్బులు ఇస్తుండగా ఏసీబీ పట్టుకుంది. వారు ఏడీ పేరు చెప్పడంతో కేసు నమోదు చేశారు.

తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది నియామకంలో అవినీతి సాగుతోందని బహిరంగంగానే విమర్శలొస్తున్నాయి.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో మొదటిసారి

తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం మొదటిసారి దాడులు నిర్వహించారు. భూ మార్పిడికి పరిపాలన విభాగం అధికారి దానయ్య, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు దుద్యాలకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.5లక్షలు లంచం తీసుకుంటూ దొరికారు. కార్యాలయంలో మొదటిసారిగా ఇంత పెద్దమొత్తంలో లంచం తీసుకుంటూ పట్టుబడింది వీరే కావడం గమనార్హం.

**ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నంబర్ 1064**ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ప్రజలు 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు. ఫిర్యాదుదారుని పేరు, వివరాలను రహస్యంగా ఉంచుతామన్నారు.

# స్వనిధి.. వీధి వ్యాపారులకు ఉపాధి



కరీంనగర్: ప్రధానమంత్రి స్వనిధి పథకం వీధి వ్యాపారులకు అవకాశంగా మారింది. ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు ఉపాధి మెరుగు పర్చుకోవడానికి ఆసరా కలిగింది. ఉమ్మడి జిల్లాలోని నగర, పురపాలికల్లో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగించే వీధి వ్యాపారులకు.. కరోనా లాక్‌డౌన్ తర్వాత నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మ నిర్భర్ పథకం కింద స్వల్పకాలిక రుణాలు మంజూరు చేస్తున్నాయి. వడ్డీ వ్యాపారుల నుంచి రక్షణ పొందేలా రోజు వారీగా పని చేసే వీధి వ్యాపారులను గుర్తించి పేర్లను నమోదు చేసుకున్నారు. గుర్తించిన లబ్ధిదారుడికి మొదటి విడతలో రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తుండగా ఈ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుడి ఖాతాలో జమ అవుతుంది.

**రూ.50 వేలకు పెరిగిన రుణం**

నగరపాలికలు, పురపాలికల్లో గుర్తించిన వీధివ్యాపారులకు నాలుగేళ్ల కిందట ప్రతి వీధివ్యాపారికి రూ.10 వేలు ఖాతాలో జమ చేయగా, ఈ మొత్తాన్ని ఏడాదిలోపు వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లించాలి. సక్రమంగా చెల్లించిన వారికి మళ్లీ రుణం తీసుకోవడానికి అర్హత లభిస్తుంది. ఇలాంటి వారికి రెండో విడతలో రూ.20 వేలు అందిస్తుండగా తాజాగా ఈ మొత్తాన్ని మూడో విడతలో రూ.50 వేలకు పెంచారు. రుణ మొత్తం క్రమేణా పెరుగుతుండటంతో సరైన విధంగా వాయిదాలు చెల్లిస్తే బ్యాంకర్లే నేరుగా పెద్ద మొత్తంలో రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపించే అవకాశముంటుంది. తద్వారా వ్యాపారాభివృద్ధి సాధించేందుకు మార్గం సుగమం అవుతుంది.

**ఎప్పటికప్పుడు లక్ష్య సాధన**

ఆత్మనిర్భర్ కింద రుణాలు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని విధిస్తుంది. పలు పురపాలికలు, కార్పొరేషన్లు ఆయా లక్ష్య సాధనకు పోటీ పడుతున్నాయి. జిల్లాల వారీగా స్థానాలు కేటాయిస్తుండటంతో రుణాలు ఇప్పించడం, చెల్లించేలా ప్రోత్సహించడాన్ని మెప్మా అధికారులు చొరవ చూపుతున్నారు. మార్చి నెలాఖరులోగా నిర్ణీత మొత్తాన్ని వీధివ్యాపారులకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# ముంపు పరిహారానికి మోక్షమెప్పుడో?



భువనగిరి : నీళ్లు విడుదల చేస్తామని చెప్పి మూడేళ్లు అవుతోంది. ముంపు గ్రామానికి అవార్డు పాసై ఏడాది కావొస్తోంది. సగం నిధులు మంజూరు చేస్తూ నెల రోజులు దాటింది. కానీ ఇంత వరకు డబ్బులు విడుదల చేయలేదు. మిగిలిన డబ్బులు ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియని పరిస్థితుల్లో భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్ ముంపు నిర్వాసితులు ఎదురు చూస్తున్నారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు.

**ఇదీ విషయం**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బస్వాపూర్‌లో 11.39 టీఎంసీల సామర్థ్యంతో నృసింహసాగర్ జలాశయం నిర్మాణం చేపట్టిన విషయం విదితమే. దాదాపు 90శాతం నిర్మాణం పూర్తయినా పునరావాసం, పునర్ నిర్మాణం, భూములు, ఇళ్లు కోల్పోతున్న వారికి పరిహారం డబ్బులు చెల్లించడంలో గత ప్రభుత్వం జాప్యం చేయగా ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం రేపు.. మాపు అంటూ దాటవేస్తూ నిర్వాసితులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. 1.50 టీఎంసీల నీరును విడుదల చేస్తామని కేసీఆర్ ప్రభుత్వం 2020లోనే ప్రకటించింది. గ్రామం ముంపునకు గురవుతుందని తేదీ 5.2.2020 నోటిఫై చేశారు. 597 గృహాలు మునిగిపోనున్నాయని గుర్తించి సామాజిక, ఆర్థిక సర్వే చేసి 822 ఇళ్ల ప్లాట్లు అందజేశారు.

**జీవో వచ్చినా విడుదల కాని నిధులు**

ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్థులకు పునరావాసం, పునర్ నిర్మాణం కింద భువనగిరి హుస్నేనాబాద్‌లోని సర్వే నెంబరు 107లో సుమారు 75 ఎకరాల్లో కాలనీకి 822 గ్రామస్థులకు ప్లాట్లు కేటాయించారు. కాలనీ అభివృద్ధి పనులు చేపట్టారు. కొన్ని నిర్మాణాలు ప్రారంభించారు. తిమ్మాపూర్ గ్రామస్థులకు ఇళ్లు, ఇతర నిర్మాణాలు, చెట్లు చేమలు, బోర్లకు పరిహారం చెల్లించలేదు. సర్వే పూర్తి చేసి గత ఏడాది జనవరిలో అవార్డు పాస్ చేశారు. వీటికి కాను రూ. 109.72 కోట్లు అవసరమని అధికారులు తేల్చారు. 5.1.2024న అప్పటి కలెక్టర్ అవార్డు పాస్‌చేశారు. ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది.

ముంపునకు గురవుతున్న నిర్వాసిత గ్రామానికి రూ.109.72 కోట్లను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉండగా రూ.50 కోట్లు మంజూరు చేస్తూ తేదీ 13.11.24న ఉత్తర్వులు జారీ చేసింది. కానీ డబ్బులు విడుదల చేయలేదు. మిగిలిన రూ.58 కోట్లను ఎప్పుడు విడుదల చేస్తారో తెలియని పరిస్థితి ఉంది.

**వెంటనే పరిహారం చెల్లించాలి -ఉడుత ఆంజనేయులు, బీఎన్ తిమ్మాపూర్**

అవార్డు పాస్ చేసి ఏడాది అవుతుంది. కానీ డబ్బులు రాలేదు. రేపు మాపు అంటూ అధికారులు తిప్పిస్తున్నారు. వెంటనే డబ్బులను విడుదల చేయాలి. పరిహారం డబ్బులు సకాలంలో వస్తే కొత్తకాలనీలో ఇళ్లు నిర్మించుకునే వాళ్లం. లేదా మరోచోట స్థలం కొనుగోలు చేసుకునే వాళ్లం. తమ భూములు లాక్కుని, ఉన్న ఊరును ఖాళీ చేయిస్తూ డబ్బులు ఇవ్వకపోవడం బాధాకరం.

# బకాయిల భారం

కోరుట్ల : విద్యుత్తుశాఖకు బకాయిలు భారంగా మారాయి. నెలలో 200 యూనిట్లలోపు వినియోగించుకున్న వారికి ఉచితంగా విద్యుత్తును అందజేస్తుండగా వ్యవసాయానికి ఉచితంగా సరఫరా చేస్తోంది. మిగతా అవసరాలకు వినియోగించుకున్న విద్యుత్తు బిల్లులను సకాలంలో వినియోగదారులు చెల్లించకపోవడంతో భారీగా బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇళ్లు, దుకాణాలు, వాణిజ్య, వ్యాపారాల అవసరాలకు వినియోగించుకున్న విద్యుత్తు బిల్లులను నెలనెలా కచ్చితంగా వసూలు చేసే విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది ప్రభుత్వశాఖల, మున్సిపల్, గ్రామపంచాయతీల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వశాఖలు, కార్యాలయాలు విద్యుత్తు బిల్లుల చెల్లింపుల్లో ఏళ్ల తరబడి జాప్యం ప్రదర్శిస్తున్నారు. డిసెంబర్ 2023 నుంచి డిసెంబర్ 2024 వరకు వివిధ శాఖల్లో పేరుకుపోయిన బిల్లులు భారీగా ఉన్నాయి.విద్యుత్తుశాఖ మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో కోరుట్ల, మెట్‌పల్లి పురపాలక సంఘాలతోపాటు కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాలు ఉన్నాయి. కోరుట్ల పురపాలక సంఘం రూ.1.44 కోట్లు, మెట్‌పల్లి పురపాలక సంఘం రూ.1.47 కోట్ల బకాయిలున్నాయి. ఏడు




మండలాల గ్రామపంచాయతీల విద్యుత్తు బకాయిలు మొత్తం రూ.9.38 కోట్లు ఉన్నాయి. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్‌లు ఏడు మండలాల్లో గ్రామపంచాయతీలు, వివిధ ప్రభుత్వ విద్యాలయాలు, శాఖల, కార్యాలయాలు ఇలా మెట్‌పల్లి విద్యుత్తుశాఖ సర్కిల్ పరిధిలో ఏడాది కాలంగా మొత్తం రూ.13.73 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటి వసూలు కోసం విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా చెల్లింపుల్లో ఆయాశాఖ అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యుత్తుశాఖ మెట్‌పల్లి సర్కిల్ పరిధిలోని రెండు పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీలు, వివిధ శాఖల్లో పేరుకుపోయిన బకాయిలు ఇలా ఉన్నాయి.

# జప్తు తాఖీదులు.. భూముల వేలం

నస్రుల్లాబాద్: నస్రుల్లాబాద్ మండల పరిధిలోని కొందరు రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు తిరిగి చెల్లించలేదు. దీంతో నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు రైతులకు తాఖీదులు జారీ చేస్తున్నారు. రుణాల వసూళ్లకు తనఖా పెట్టిన భూములను వేలం వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

**ఏయే పరిధిలో ఎంతంటే..**

దుర్కి, నస్రుల్లాబాద్, మైలారం, నాచుపల్లి, మిర్జాపూర్ గ్రామాల్లోని పీఏసీఎస్‌ల పరిధిలో రైతులు 2009 నుంచి 2019 వరకు విడతల వారీగా దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. పలు కారణాలతో చెల్లించలేదు.ఐదు రోజుల కిందట దుర్కి సహకార పరిధిలోని అంకోల్ తండా, సంగెం, అంకోల్, బస్వయిపల్లి గ్రామాల్లోని ఐదుగురు రైతులకు తనఖా పెట్టిన భూములను వేలం వేసేందుకు అధికారులు జప్తు తాఖీదులు జారీ చేశారు. భూముల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ నెల 20న అంకోల్ తండా రైతు అనూషబాయి భూమిని వేలం వేసేందుకు జిల్లా అధికారులు రాగా.. రూ.2 లక్షలు చెల్లించడంతో వాయిదా వేశారు. నస్రుల్లాబాద్ సొసైటీలో 150 మంది రూ.7 కోట్లు చెల్లించాల్సి ఉంది. మైలారం సొసైటీలో 27 మంది రూ.1.74 కోట్లు చెల్లించాలని అధికారులు గతేడాది డిమాండ్ తాఖీదులు జారీ చేశారు. మైలారానికి చెందిన రైతు తోటవార్ సాయిలు ఇటీవల రూ.3 లక్షల రుణం చెల్లించడంతో భూముల వేలం వాయిదా వేశారు.

వడ్డీతో కలిపి మరింతగా..

దుర్కి సొసైటీ పరిధిలో 2009 నుంచి 2014 వరకు 370 మంది రైతులు రూ.8 కోట్ల రుణాలు తీసుకున్నారు. సకాలంలో చెల్లించక



వడ్డీతో కలిపి ఇది రూ.13 కోట్ల వరకు అయింది. నాచుపల్లి సొసైటీలో 2015 నుంచి 2017 వరకు 70 మంది రైతులు తీసుకున్న రూ.2 కోట్ల రుణం వడ్డీతో కలిపి రూ.3.50 కోట్లు అయింది. మిర్జాపూర్ సొసైటీలో 2016 నుంచి 2018 వరకు నలుగురు రైతులు రూ.18 లక్షల రుణం తీసుకోగా.. ప్రస్తుతం రూ.30 లక్షలు చెల్లించాల్సి ఉంది.రూ.3 లక్షలు చెల్లించాను

– రావుల స్రవంతి, సంగెం

దుర్కి సొసైటీలో 2016లో పాల డెయిరీ కేంద్రానికి రూ.4.50 లక్షల రుణం తీసుకున్నాం. వడ్డీతో కలిపి రూ.7.86 లక్షలు అయిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు విడతల వారీగా రూ.3 లక్షలు చెల్లించాను. ఇంకా చెల్లించాలని అధికారులు నిత్యం వేధిస్తున్నారు.

**రుణం కట్టడంతో వాయిదా వేశాం**

– సందీప్, ఎన్‌డీసీసీబీ బ్యాంకు మేనేజర్, నస్రుల్లాబాద్

రుణాలు చెల్లించని రైతులకు ఎన్‌డీసీసీబీ డీఆర్‌వోఎస్‌డీ అధికారుల ఆదేశాల మేరకు తాఖీదులు జారీ చేస్తున్నాం. ఇటీవల ఓ రైతు భూమిని వేలం వేసేందుకు సిద్ధం కాగా.. కొంత రుణం చెల్లించడంతో వేలం వాయిదా వేశాం. తాఖీదులు స్వీకరించిన కొంత మంది రైతులు రుణాలు చెల్లిస్తున్నారు.

# చెత్తతో చిచ్చు... కుక్కలతో రచ్చ!

హైదరాబాద్: అక్కడ చెత్తచెదారం గొడవలకు కారణమవుతున్నాయి. పెంపుడు జంతువులు కలహాలు సృష్టిస్తున్నాయి. గచ్చిబౌలిలో 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీలో రెండు కుటుంబాలు ఎదురెదురుగా ఉన్నా.. మాటల్లేవు. పొరుగు కుటుంబానికి చెందిన పెంపుడుకుక్క తమ ఇంటి ఎదుట మూత్రవిసర్జన చేసిందంటూ గృహిణి తిట్టడంతో.. తమనే అంతమాట అంటారా! అంటూ అవతలి వారు గొడవకు దిగారు. కమిటీ పెద్దలు సూచించినా మాట వినకుండా.. పోలీసు ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసుకునేంత వరకూ చేరారు. కేపీహెచ్‌బీ కాలనీలోని అపార్ట్‌మెంట్స్ సముదాయంలో సంక్షేమసంఘం సమావేశంలో ఇద్దరు పెద్దల మధ్య తలెత్తిన స్వల్ప వివాదంతో ఒక వ్యక్తి లైసెన్స్‌డ్ తుపాకీతో బెదిరించేంత వరకూ చేరినట్టు విశ్వసనీయ సమాచారం.

**అనుకున్నదొక్కటి.. అయినదొక్కటీ**

భార్యాభర్తలిద్దరు ఐటీ నిపుణులు.. సొంతూళ్లో పొలం విక్రయించగా వచ్చిన సొమ్ముతో మూసాపేటలోని గేటెడ్ కమ్యూనిటీలో విల్లా కొన్నారు. కొత్తగా ఏర్పడిన కమిటీలో అధ్యక్షుడిగా పోటీపడిన వ్యక్తికి



ఓటేయలేదనే అక్కసుతో కొన్ని కుటుంబాలు వీరిని దూరంగా ఉంచాయి. వారి పిల్లాడితో ఆడుకోవద్దని తమ బిడ్డలకు చెప్పారంటూ ఆ తండ్రి ఆవేదన వెలిబుచ్చాడు. మాదాపూర్‌లోని గేటెడ్ కమ్యూనిటీలో ఉంటున్న తనకు మొదట్లో హాయిగా అనిపించినా క్రమంగా అక్కడ అంతర్గత రాజకీయాలు, ఉత్తరాది, దక్షిణాది ప్రజల మధ్య విబేధాలు బాధ కలిగిస్తున్నాయని నగరానికి చెందిన వ్యాపారి వివరించారు. గేటెడ్ కమ్యూనిటీస్‌లో కుటుంబాల మధ్య గొడవలకు అధికశాతం ఇంటినుంచి పడేసే వ్యర్థాలు, పెంపుడు జంతువులే కారణమని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. సంక్షేమసంఘంలో తమ ప్రాతినిధ్యమే ఉండాలనే ఉద్దేశంతో వర్గాలుగా విడిపోయి ఉంటున్నారని సైబరాబాద్‌కు చెందిన ఒక ఇన్‌స్పెక్టర్ చెప్పారు. ప్రతినెలా తమ ఠాణాకు నాలుగైదు ఫిర్యాదులు ఇక్కడనుంచే వస్తున్నాయన్నారు. అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినపుడు కలసిమెలసి ఉండాలని సూచిస్తుంటామని డీసీపీ వివరించారు. అక్కడి కుటుంబాల వాట్సాప్ గ్రూపుల్లోనూ పరస్పర విమర్శలు, ఆరోపణలతో గొడవకు దిగుతున్నారన్నారు.

# నేతన్నకు నూలు సాయం

సిరిసిల్ల : జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా మరమగ్గాలపై వస్త్రోత్పత్తులు జరుగుతున్నాయి. ఇక్కడ యజమాని, ఆసామి, కార్మికులు అని మూడంచెల వ్యవస్థ నడుస్తోంది. వస్త్రోత్పత్తుల ఆర్డర్లు వచ్చినప్పుడు పెట్టుబడుల కోసం చిన్న, మధ్య తరగతి ఆసాములు పూర్తిగా యజమానులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. దీనిలో మార్పు తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడలో రూ.50 కోట్ల కార్పస్ ఫండ్‌తో నూలు బ్యాంకును ప్రారంభించారు. ఇది ఉమ్మడి జిల్లాలోని చేనేత, మరమగ్గాల ఆసాములకు పెట్టుబడి భారం తగ్గిస్తుంది.

రాష్ట్రంలో 17 జిల్లాలో మరమగ్గాలు విస్తరించి ఉన్నాయి. వీటిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సిరిసిల్ల, కరీంనగర్, కొత్తపల్లి, గర్షకుర్తిలో 32 వేల మరమగ్గాలు, అయిదు వందల చేనేత మగ్గాలున్నాయి. వీటిపై ప్రభుత్వ, ప్రైవేటు వస్త్రోత్పత్తులు కలిపి ఏటా 20 వేల టన్నుల పాలిస్టర్, అయిదు టన్నులపైన కాటన్ నూలును వాడుతారు. మరమగ్గాలన్నీ పని చేస్తే రోజుకు పాలిస్టర్ 13.20 లక్షలు, కాటన్ 6.60 లక్షల మీటర్ల వస్త్రోత్పత్తి జరుగుతోంది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఎక్కడా నూలు బ్యాంకు, ప్రైవేటు విక్రయశాలలు లేవు. ఉత్పత్తులకు అవసరమైన నూలును వ్యాపారులు హైదరాబాద్, మహారాష్ట్ర, సూరత్‌ల నుంచి తెప్పించి ఆసాములకు ఇస్తున్నారు. ప్రస్తుతం వేములవాడ చేనేత క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన నూలు బ్యాంకుతో సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లోని ఆసాములకు ఉపయోగపడుతుంది.

**ప్రైవేటు ఉత్పత్తులకు?**

ఉమ్మడి జిల్లా వస్త్రోత్పత్తిదారులు చేతిరుమాళ్లు మొదలుకొని పట్టు, సిల్క్ వస్త్రాల వరకు ప్రైవేటు ఆర్డర్లు కూడా ఉత్పత్తి చేస్తుంటారు. వీటికి పక్క రాష్ట్రాల నుంచి నూలు దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ఆసాములకు రవాణా భారంతోపాటు కొన్ని సందర్భాల్లో ఆర్డర్లకు అనువైన నూలు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు నూలు కంపెనీలు సైతం జిల్లాలో నేరుగా విక్రయశాలలు ఏర్పాటు చేస్తే జిల్లా వస్త్ర పరిశ్రమలో ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయి.

**ప్రభుత్వ ఆర్డర్లకే**

వేములవాడలో టెస్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూలు బ్యాంకు ప్రభుత్వ ఆర్డర్లకు సరఫరా చేయనున్నది. వస్త్రోత్పత్తుల ఆర్డర్లు పొందిన మ్యాక్స్ సంఘాలకు అవసరమైన నూలు 90 శాతం అప్పుపైన ఇస్తారు. మిగతా పది శాతం సంఘాల్లోని సభ్యులంతా కలిసి చెల్లించాలి. పూర్తయిన వస్త్రోత్పత్తులు తిరిగి టెస్కోకే అప్పగించాలి. ఇలా అప్పగించిన వస్త్రంలో నూలు బిల్లులు మినహాయించుకుని మిగతా డబ్బులు చెల్లిస్తారు. దీంతో ఆసాములకు పెట్టుబడి భారం తగ్గుతుంది.

నూలు ఇవ్వడం ద్వారా పెట్టుబడి భారం తగ్గుతుంది. కానీ వస్త్రోత్పత్తులు చేసే కార్మికులకు ప్రతి వారం వేతనాలు ఇవ్వాలి. దీనికోసం ఆసాములు మరొకరిని ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఉంటాయి. సిరిసిల్లలోని మరమగ్గాలు విస్తరించిన ప్రాంతాలు ఎక్కువగా ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాలు కావడం వల్ల వీటికి బ్యాంకులు రుణాలు ఇవ్వవు. ప్రభుత్వ మ్యాక్స్ సంఘాలకు రుణ పథకాలు అమలు చేయాలని ఆసాములు కోరుతున్నారు.

ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రోత్పత్తులను టెస్కో నుంచి మాత్రమే సేకరించాలని ఇది వరకే ఉత్తర్వులు జారీ చేసింది. దానిలో భాగంగా ఏకరూప దుస్తులు, సంక్షేమశాఖకు అవసరమైన వస్త్రం ఆర్డర్లు ఇచ్చారు. ఇవి కాకుండా రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఏటా రెండు చీరలు ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసింది. దీనికి సంబంధించి 1.28 కోట్ల చీరలు అవసరం. వీటి ఆర్డర్లలో సింహభాగం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లోనే ఉత్పత్తి జరగనుంది.ప్రభుత్వ ఆర్డర్లు ఖరారయ్యాక టెస్కో ఆధ్వర్యంలో నూలు కొనుగోలుకు టెండర్లు పిలుస్తారు. అందులో అవకాశం దక్కించుకున్న సంస్థలు మాత్రమే నూలు సరఫరా చేస్తాయి.

# అసలెంతో లెక్కలేదు.. ఆక్రమణకు అంతులేదు



దుండిగల్ : రూ.వంద కోట్ల సర్కారు భూమిడిని ప్లాట్లు చేసి విక్రయిస్తున్నా అధికారులు కిమ్మనడం లేదు. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ దుండిగల్ మండలం డి.పోచంపల్లి సర్వే నం. 120లో ఈ భూమి ఉంది. ఇక్కడ ప్రభుత్వ భూమి ఎంత ఉందనే లెక్కలే అధికారుల వద్ద లేవు. దీనిపై పరిశీలనలో పలు విషయాలు వెలుగుచూశాయి డి.పోంచంపల్లిలో సర్వే నంబరు 120లో ప్రభుత్వానికి 158.23 ఎకరాల భూమి ఉంది. ఇందులో 66.25 ఎకరాలు మాజీ సైనికులకు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులకు కేటాయించారు. మిగిలిన 91.98 ఎకరాలను సాగు కోసం పేదలకు పట్టాలు ఇచ్చారు. కొందరు సాగు చేయకుండా నిబంధనలు ఉల్లంఘించడంతో 45 ఎకరాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. అనంతరం భారాస కార్యాలయానికి ఎకరా, బౌరంపేట పీఏసీఎస్‌కు రెండెకరాలు, ఎస్టీ వసతి గృహానికి 2.25 ఎకరాలు, ఎవెన్యూ ప్లాంటెషన్‌కు ఎకరా కేటాయించారు. ఏడు ఎకరాల్లో రహదారులు నిర్మించారు. మిగిలిన భూమిలో 30 ఎకరాల వరకు కబ్జాకు గురైందని అధికారులు అంచనా.

**జోరుగా బస్తీల మధ్య స్థలాల విక్రయం..**

భూముల ధరలు పెరగడంతో కొన్నేళ్లుగా కబ్జాదారులు అసైన్డ్ భూముల యజమానులకు ఎంతో కొంత ముట్టజెప్పి స్థిరాస్థి వ్యాపారం చేశారు. ప్రైవేటు భూముల్లోని ప్లాట్లతో పోలిస్తే తక్కువకే రావడంతో పేదలు కొనుగోలు చేశారు. అధికారులకు ఫిర్యాదుల రావడంతో కట్టడాలను కూల్చగా.. తిరిగి నిర్మించారు. ఇళ్ల యజమానులకు 58, 59 జీవోల కింద పట్టాలు పంపిణీ చేశారు. ఇలా ఇక్కడ చంద్రశేఖర్‌రెడ్డినగర్, డాక్టర్ బస్తీ, సాయిపూజా కాలనీలు వెలిశాయి. తాజాగా కొందరు ఈ కాలనీల్లో ఇళ్ల మధ్య ఉన్న స్థలాలను రాత్రికి రాత్రే స్వాధీనం చేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. అనంతరం వాటిని రూ.15 లక్షల వరకు విక్రయిస్తున్నారు.

**కేటాయించిన భూములపై కన్ను...** గండిమైసమ్మ చౌరస్తా నుంచి మేడ్చల్ రహదారికి ఆనుకొని ఎస్సీ వసతిగృహానికి 2.25 ఎకరాలు కేటాయించారు. ఇక్కడ ఎకరా రూ.10 కోట్ల వరకు పలుకుతోంది. దీంతో ఖాళీగా ఉన్న ఈ భూమిపై అక్రమా ర్కుల కన్ను పడింది. అందులో రెండు ఇళ్లను నిర్మించారు. రోడ్డుకు ఆనుకొని ఇటీవల కంటైనర్లను ఏర్పాటు చేసి గదిని నిర్మించారు. అధికారులు గదిని మాత్రం కూల్చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి నగర్‌లోనూ మూడు ఎకరాల కబ్జాకు యత్నించారు. అదే ప్రాంతంలోని 3 ఎకరాల్లో ప్లాట్లు వేశారు. ఇక్కడే మరో 6 ఎకరాల భూమి కబ్జాదారుల పరమైంది. స్థానికుల ఆందోళనతో అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**చర్యలు తీసుకుంటాం**ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం. ఆర్ఐతో పాటు సిబ్బందిని అప్రమత్తం చేసి సర్వేనం.120లో ఉన్న కంటైనర్‌లతో పాటు ఇతర ఆక్రమణలు తొలగిస్తాం. – మతిన్, తహసీల్దార్, గండిమైసమ్మ దుండిగల్ మండలం

# మున్సిపాలిటీల్లో గ్రామ పంచాయతీల విలీనం షురూ




హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ శివారులోని మున్సిపాలిటీల్లోకి అక్కడున్న సమీప గ్రామపంచాయతీలు విలీనమయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్‌ను బాహ్యవలయ రహదారి వరకూ విస్తరించే క్రమంలో శివారు మున్సిపాలిటీలతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 51 గ్రామ పంచాయతీలను విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో శివారు మున్సిపాలిటీల్లో 51 గ్రామాలను కలిపేందుకు రెండునెలల క్రితం ఆర్డినెన్స్ జారీచేసింది. ఇందులోని అంశాలకు అనుగుణంగా మున్సిపాలిటీ అధికారులు కొద్దిరోజుల నుంచి చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీల రికార్డులు, భూములను స్వాధీనం చేసుకున్న అధికారులు ఇళ్లు, ప్రభుత్వ ఆస్తులను మున్సిపాలిటీల్లోని వార్డుల ఖాతాల్లోకి చేర్చారు. ఆస్తిపన్నులను వసూలు చేస్తున్నా.. ఆయా గ్రామ పంచాయతీల పేర్లను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయకపోవడంతో ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు సాధ్యం కావడం లేదు. ఇక ఇప్పటి వరకూ గ్రామ పంచాయతీల్లో నివసిస్తున్నవారు మున్సిపాలిటీ వ్యవస్థలోకి వెళ్లడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు, ఉద్యోగులకు బాధ్యతలు**

గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులుగా విధులు నిర్వహించిన వారిని నేరుగా పురపాలకశాఖ అధికారులుగా పరిగణనలోకి తీసుకున్నారు. ఇప్పటివరకూ వారు విధులు నిర్వహించిన సంవత్సరాలను సర్వీసుగా పరిగణించారు. గ్రామ పంచాయతీల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించిన వారిని కూడా మున్సిపాలిటీ అధికారులు తీసుకున్నా... వార్డుల్లో పని విధానం, ఇతర కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని వీరికి ఉద్యోగం ఇస్తున్నారు. సర్వే లెక్కలు, గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ గ్రామాల్లో పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగాలు ఇస్తున్నారు. వీరందరికీ పురపాలకశాఖ నుంచి జీతాలు వచ్చేవిధంగా చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీల పరిధి పెరిగిన దృష్ట్యా మరికొందరు కొత్తవారిని నియమించుకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయని మున్సిపల్ కమిషనర్లు, పురపాలక శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.


**మౌలిక వసతులపై నజర్** మున్సిపాలిటీల్లో విలీనమైన 51 గ్రామాల్లో మౌలిక వసతులపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించారు. చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కొత్తగా విలీనమైన గ్రామాల బాధ్యతలు పర్యవేక్షిస్తున్న అధికారులను ఆదేశించారు. తాగునీటి సౌకర్యం లేని ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్లతో సరఫరా చేయాలని నిర్ణయించారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీటి పరిమాణాన్ని తెలుసుకుని పంచాయతీ, గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారుల ద్వారా కొత్త పైప్‌లైన్లు, పైప్‌లైన్ల సామర్థ్యం పెంచేందుకు నివేదికలు అడుగుతున్నారు. ఆయా గ్రామాల్లో మురుగునీటి ప్రవాహాన్ని ఎక్కడికి పంపించాలన్న అంశంపై ప్రణాళికలను రూపొందించి మురుగునీటి వ్యర్థాల నిర్వహణను చేపట్టనున్నారు.

# అక్రమాలపై చర్యలేవీ..?

జగిత్యాల : జగిత్యాల పురపాలికలో వరుసగా వెలుగు చూస్తున్న అక్రమాలపై చర్యలు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన కార్మిక నియామకాలపై ఏకంగా కౌన్సిలర్లే కలెక్టర్, సీడీఎంఏకు ఫిర్యాదు చేయడంతో అధికారుల్లో గుబులు మొదలైంది. చేసిన తప్పుల్ని ఎలా దిద్దుకోవాలో తెలియక కిందిస్థాయివారిపై ఒత్తిడి చేస్తున్నారు. తాజాగా రూ.45 లక్షలతో కొనుగోలు చేసి ఏడాదిగా పక్కనబెట్టిన స్వీపింగ్‌యంత్రాన్ని వెంటనే నిర్వహణలోకి తీసుకురావాలని సీడీఎంఏ అక్టోబరు 26న తాఖీదులు జారీ చేసింది. మరోవైపు పారిశుద్ధ్య కార్మికుల అక్రమ నియామకాలపై అధికారులకు కమిషనర్ చిరంజీవి ఈ నెల 14న మెమో జారీ చేశారు. వీటన్నింటిపైనా అధికారుల వద్ద స్పష్టమైన సమాధానం లేకపోవడంతో ఉన్నతాధికారులు చర్యలకు వెనుకాడుతున్నారు.

**నియామకాల్లో బాధ్యులెవరు..?**

నాలుగు నెలల కిందట కలెక్టర్, పురపాలక ఆమోదం లేకుండా ఏకంగా 12 మంది పారిశుద్ధ్య ఒప్పంద కార్మికులను నియమించిన తీరును ఇటీవల వెలుగులోకి తెచ్చింది. ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షలు తీసుకుని కొందరు కార్మికులకు బాధ్యతలు అప్పగించారు. ఈ విషయంపై కొందరు కౌన్సిలర్లు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నియామకాల్ని రద్దు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. సీడీఎంఏకు సైతం ఫిర్యాదు చేయడంతో కార్మికుల వేతనాల దస్త్రాన్ని కమిషనర్ చిరంజీవి సైతం పక్కనపెట్టారు. గతంలో పనిచేసిన ఒకరిద్దరు కమిషనర్లు సైతం కార్మికుల నియామక అంశానికి వ్యతిరేకించిన సందర్భాలున్నాయి. తాజాగా కమిషనర్ సంబంధిత అధికారులకు ఈ నెల 14న మెమో జారీ చేశారు. పాతవారి స్థానంలో కొత్తవారిని ఎందుకు తీసుకోవాల్సి




వచ్చింది.. ఏ రకంగా నియామకాలు చేపట్టారు.. తదితర అంశాలకు 5 రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో నూతనంగా నియమించినవారికి పనిచేసిన కాలంలో వేతనాలు చెల్లించి దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కమిషనర్‌కు మౌఖిక ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం.

**మరమ్మతుకు రూ.12 లక్షలు..**

పట్టణ ప్రగతి నిధుల నుంచి మూడేళ్ల కిందట రూ.45 లక్షలతో కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రం ఏడాది తిరగకముందే సాంకేతిక పరమైన మరమ్మతులతో మూలన పడింది. గతేడాది బల్దియా అధికారులు రూ.12 లక్షలు మరమ్మతుకు ఖర్చు చేసినట్లు చూపినా ఇప్పటి వరకూ రోడ్డెక్కకపోవడం గమనార్హం. కొత్తబస్టాండు నీళ్లట్యాంకు వద్ద వృథాగా ఉన్న స్వీపింగ్ యంత్రాన్ని వెంటనే నిర్వహణలోకి తీసుకురావాలని సీడీఎంఏ అధికారులను ఆదేశించినా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

# ఆన్‌లైన్‌లో వివరాలు లేక.. సీసీఐకి విక్రయించలేక..

కోనరావుపేట : ఆరుగాలం కష్టించి పండించిన పత్తిని భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి ఇబ్బందులు తప్పడం లేదు. వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల అన్నదాతలు సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో సీసీఐ అధికారులు తెల్లబంగారం కొనుగోలుకు అంగీకరించడం లేదు. దీంతో చేసేదేమీ లేక కొంతమంది రైతులు మధ్యదళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు.

జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో ఈ ఏడాది వానాకాలంలో రైతులు తెల్లబంగారం సాగు చేశారు. వేములవాడ నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు జిల్లాలోని బోయినపల్లి, ఇల్లంతకుంట, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో నల్లరేగడి భూములు ఎక్కువగా ఉండటంతో పత్తిసాగు చేశారు. రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి వేములవాడ పురపాలక సంఘం పరిధిలో నాంపల్లి, వేములవాడ అర్బన్ మండలం సంకెపల్లి, కోనరావుపేట మండలం సుద్దాల, ఇల్లంతకుంట మండలంలో మరో రెండు కొనుగోలు కేంద్రాలను సీసీఐ ఏర్పాటు చేసింది.

క్వింటాల్ పత్తికి 8 తేమ శాతం ఉంటే రూ.7,521ల గరిష్ఠ మద్దతు ధర చెల్లించనున్నారు. 12 తేమ శాతం ఉంటే రూ.7,220ల కనిష్ఠ మద్దతు ధర ప్రకటించింది.



సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించాలంటే వ్యవసాయశాఖ అధికారులు రైతుల పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉండాలన్న నిబంధనను తప్పనిసరి చేసింది. చాలా మంది రైతుల పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. దీంతో సీసీఐ కేంద్రాల్లో అమ్మకానికి అడ్డంకి ఏర్పడింది. దీంతో మధ్యదళారులకు క్వింటాల్ రూ.6,500 నుంచి రూ.6,800లకు విక్రయిస్తున్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం సమయంలో తేమశాతం అధికంగా ఉండటంతో చాలా మంది విక్రయానికి తీసుకురాలేదు. వారం, పది రోజులుగా వాతావరణం అనుకూలించడం వల్ల తేమశాతం రావడంతో రోజుకు 80 పైగా వాహనాల్లో తీసుకొస్తున్నారు.

వ్యవసాయ విస్తరణాధికారుల తప్పిదంతో...


వ్యవసాయ విస్తరణాధికారులు తమ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో రైతుల పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. వారు క్షేత్రస్థాయికి వెళ్లకుండా రైతు వేదికల్లో కూర్చొని ఇతర రైతులను అడిగి తెలుసుకుని నమోదు చేశారు. పంట వివరాలు సేకరణలో నిర్లక్ష్యం వల్ల పత్తికి బదులుగా వరి, వరికి బదులుగా పత్తి నమోదు చేశారు. మరికొందరి పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. దీంతో అన్నదాతలు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయానికి ప్రతిబంధకంగా మారింది.

**తాత్కాలిక నమోదుకు చర్యలు- ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి**

మధ్యదళారులను అరికట్టడానికి సీసీఐ పటిష్ఠ చర్యలు తీసుకుంది. వ్యవసాయశాఖ అధికారులు పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోతే సీసీఐ నిబంధనల మేరకు పత్తి విక్రయాలకు అవకాశం లేదు. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ప్రస్తుతం అవకాశం లేదు. సమస్య మా దృష్టికి వచ్చింది. అర్హులైన రైతులు పత్తి విక్రయానికి తాత్కాలికం(టెంపరరీ)గా వారి వివరాలు నమోదుకు అనుమతులు ఇవ్వాలన్నది కలెక్టర్, ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. అనుమతులు రాగానే ఏఈవోలు అర్హులైన రైతులకు తాత్కాలిక నమోదు పత్రాలు ఇస్తే విక్రయానికి ఇబ్బందులు ఉండవు. రైతులు కొంత ఓపిక పట్టాలి.

# రైతులకు తేమ కష్టాలు

ఆలేరు : ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి రోజుల తరబడి ఆరబోస్తున్నా 17శాతం తేమ రావడంలేదు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో వానాకాలం సీజన్‌లో 11.68 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 15.72 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. శీతాకాలం కావడం, వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతుండటంతో నిర్ణీత తేమశాతం రావడం లేదు. కొనుగోలు దారులు తూకం వేయడం లేదు. ఫలితంగా రైతులు 10–15 రోజులు కేంద్రాలలో నిరీక్షించాల్సి వస్తోంది.



**ఆర బెట్టడం సమస్యగా మారుతోంది...**

ధాన్యాన్ని ఆర బెట్టడం రైతులకు పెద్ద సమస్యగా మారుతోంది. కేంద్రాలలో సరిపడినంతగా స్థలం లేకపోవడం, సకాలంలో కూలీలు దొరకకపోవడం లాంటివి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అయినప్పటికీ రైతులు రోజుకు ధాన్యాన్ని రెండు, మూడు దఫాలుగా ఆర బెడుతున్నారు. అయినప్పటికీ తేమశాతం రావడం లేదు. రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోతుండటంతో ధాన్యంపై మంచు కురిసి.. మధ్యాహ్నం వరకు కూడా పోవడం లేదు.

ధాన్యం ఎండడానికి సమయం పడుతోంది. ఒకవైపు, మరోవైపు వాతావరణ మార్పులతో పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండటంతో కూడా ధాన్యంలో తేమ శాతం రాకపోవడానికి ఒక కారణంగా నిలుస్తోంది. రైతులు నిత్యం ఉదయం పది గంటలకు ఆరబోయడం.. సాయంత్రం ఐదు గంటలకు కుప్పలు చేస్తున్నారు.

**తూకానికి మరింత సమయం..** ధాన్యంలో తేమశాతం రావడం ఒక ఎత్తైతే.. తేమశాతం వచ్చిన తర్వాత ధాన్యాన్ని తూకం వేయడం మరొక ఎత్తుగా మారుతోంది. కొన్ని కొనుగోలు కేంద్రాలలో సాయంత్రం తేమ శాతం వస్తే ఉదయం కల్లా తగ్గుతోంది. కేంద్రం నిర్వాహకులు ధాన్యాన్ని తూకం వేయడం లేదు. ఫలితంగా కేంద్రాలు ధాన్యం రాసులతో నిండిపోతున్నాయి. ఫలితంగా రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలలో నిరీక్షించాల్సి వస్తుండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

# మన్మోహన్ పార్థివదేహానికి నివాళులర్పించిన సీఎం చంద్రబాబు





దిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దిల్లీలో మన్మోహన్ పార్థివదేహానికి నివాళులర్పించిన అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు.

ఆయన మరణం బాధాకరమన్నారు. ఆయన దేశానికి అవిశ్రాంతంగా సేవలందించారని కొనియాడారు. దూరదృష్టితో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారని.. అనేక పదవులను సమర్థంగా నిర్వహించారని చెప్పారు. చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని, తెదేపా ఎంపీలు కేశినేని చిన్ని, శబరి మాజీ ప్రధాని భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.





# మన్మోహన్ పార్థివదేహానికి రాష్ట్రపతి, ప్రధాని నివాళి

దిల్లీ: భారత మాజీ ప్రధానమంత్రి, దేశ ఆర్థిక సంస్కరణల రూపకర్త మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన పార్థివదేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరంద్రమోదీ నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం మన్మోహన్ నివాసానికి వెళ్లిన వీరు.. ఆయన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "ఆర్థికవేత్తగా, సంస్కరణల సారథిగా మన్మోహన్ సింగ్‌ను దేశం గుర్తుంచుకుంటుంది. ఆర్‌బీఐ గవర్నర్ సహా అనేక కీలక పదవుల్లో దేశానికి సేవలందించారు. పీవీ హయాంలో ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేశారు. దేశం, ప్రజల పట్ల ఆయన సేవాభావం స్మరించుకోదగినది. విలక్షణ పార్లమెంటేరియన్‌గా ఆయన సేవలు అందించారు. ఎన్నో కీలక పదవులు చేపట్టినా నిరాడంబర జీవితం గడిపారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఆయనతో చాలాసార్లు మాట్లాడా. ఆయన మృతి విచారకరం. నా తరఫున, దేశ ప్రజల తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నా" అని మోదీ తెలిపారు.

**తాను ఏటికి ఎదురీది.. దేశాన్ని ఒడ్డున పడేసి..! :** 92 ఏళ్ల మన్మోహన్ సింగ్ వయసురీత్యా తలెత్తిన అనారోగ్య సమస్యలతో నిన్న రాత్రి ఇంటివద్ద అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. దీంతో కుటుంబసభ్యులు ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ తుదిశ్వాస (%మీఖఅఎశీష్త్రుఖఅ ాఖఅస్త్రష్ట ఐవఎఅంవ%) విడిచారు. మన్మోహన్ పదేళ్ల పాటు దేశానికి ప్రధానిగా సేవలందించారు. అంతకుముందు ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. ప్రధానిగా పీవీ నరసింహారావు హయాంలో ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను పూర్తి అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఇప్పటికే కేంద్రం వెల్లడించింది. ఆయన మృతికి సంతాప సూచికంగా 7 రోజులు సంతాప దినాలను ప్రకటించింది. ప్రజల సందర్శనార్థం శనివారం ఆయన భౌతికకాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకురానున్నారు. శనివారం (డిసెంబరు 28) రాజ్‌ఘాట్ సమీపంలో ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

# మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి సోనియా, రాహుల్, ఖర్గే నివాళులు



దిల్లీ: భారత మాజీ ప్రధానమంత్రి, దేశ ఆర్థిక సంస్కరణల రూపకర్త మన్మోహన్ సింగ్ (92) పార్థివ దేహానికి కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ "మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా అపారమైన జ్ఞానం, సమగ్రతతో భారతదేశాన్ని అభివృద్ధి వైపు నడిపించారు. ఆయనలోని వినయం, ఆర్థికశాస్త్రంపై ఆయనకున్న లోతైన అవగాహన దేశానికి స్ఫూర్తినిచ్చాయి. నా జీవితంలో ఎంతో ముఖ్యమైన ఓ గురువును కోల్పోయాను" అని అన్నారు. ప్రియాంకా గాంధీ వాద్రా, ఆమె భర్త రాబర్ట్ వాద్రా సైతం మన్మోహన్ నివాసానికి చేరుకున్నారు. రాబర్ట్ వాద్రా మాట్లాడుతూ.. మన్మోహన్ ఎల్లప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేసేవారని పేర్కొన్నారు. ఆర్థిక విషయాలపై ఆయనకు చాలా జ్ఞానం ఉందని అన్నారు. మన్మోహన్ సింగ్ యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా పని చేశారు. కాంగ్రెస్ పార్టీతో, గాంధీ కుటుంబంతో మన్మోహన్‌కు మంచి సంబంధాలు ఉన్నాయి. గురువారం రాత్రి ఆయన మరణవార్త తెలియడంతో కర్ణాటకలోని బెళగావిలో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశాలను అర్ధంతరంగా ముగించి.. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ వెంటనే దిల్లీకి బయలుదేరారు. దిల్లీలోనే ఉన్న సోనియా, ప్రియాంక ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు.

# వేడుకల్లో జగన్.. వీధుల్లో వైసీపీ నేతలు.. విషయం ఏంటంటే!



పులివెందుల : వైసీపీ అధినేత జగన్.. పెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. కానీ, ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలు మాత్రం వీధులకెక్కారు. చిత్రమైన ఈ ఘటన ఈ రోజే(శుక్రవారం) చోటు చేసుకుంది. పులివెందుల పర్యటనలో ఉన్న జగన్.. తన సతీమణితో కలిసి ఓ పెళ్లి వేడుకకు హాజరయ్యారు. దాదాపు రెండు గంటల పాటు అక్కడే ఉన్నారు. వధూవరులను ఆశీర్వదించారు.

ఇతర వివాహాలకు వెళ్లినప్పుడు ఎలాంటి ఆహార పదార్థాలూ పుచ్చుకోని జగన్ దంపతులు ఈ వేడుకలో మాత్రం కొంత పుచ్చుకున్నారు. ఇదిలా వుంటే, మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు మాత్రం రోడ్డెక్కారు. అన్ని జిల్లాల్లోనూ కాకపోయినా.. కొన్ని కొన్ని జిల్లాల్లో మాత్రం కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, రాస్తారోకోలకు పిలుపునిచ్చారు. ఆ మేరకు నాయకులు తమ తమ కార్యకర్తలతో కలిసి రోడ్డెక్కారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. విద్యుత్ చార్జీలను పెంచారని.. దీంతో ప్రజలు భారాలు మోయలేక పోతున్నారని ఆరోపిస్తూ ఈ నెల ప్రారంభంలోనే జగన్ ఈ ధర్నాలు, నిరసనలకు పిలుపునిచ్చారు. దీంతో రాష్ట్రంలోని బలమైన ప్రాతినిధ్యం ఉన్న చోట్ల మాత్రమే ప్రస్తుతం నిరసనలు జరుగుతున్నాయి. పలువురు మాజీ మంత్రులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అయితే.. నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చిన జగన్ మాత్రం.. వివాహ వేడుకలకు హాజరు కావడం మైనస్ అయింది. ఆయన నాయకత్వం వహించి ఉంటే పరిస్థితి వేరేగా ఉండేది.


కానీ, జగన్ వేడుకలకు హాజరు అయినట్టు తెలియడంతో చాలా మంది నాయకులు ఏదో తూతూ.. మంత్రం అన్నట్టుగానే ఈ నిరసనలు నిర్వహించి ఇంటికి పోయారు. ఈ నెలలో 21వ తేదీ నిర్వహించిన రైతు నిరసన సమయంలోనూ జగన్ ఇలానే చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను ధర్నాలు చేయాలని పిలుపునిచ్చిన ఆయన.. ఆ వెంటనే బెంగళూరుకు వెళ్లిపోయారు. ఇక, ఇప్పుడు కూడా వివాహ వేడుక అనంతరం.. బెంగళూరుకు వెళ్లేందుకు హెలికాప్టర్‌ను రెడీ చేసుకున్నారు. దీంతో చిత్తశుద్ధి లేని శివ పూజ మాదిరిగా జగన్ వ్యవహారం ఉందనే కామెంట్లు వినిపిస్తున్నాయి.

# ఛార్జీలు పెంచినందుకే.. జగన్‌కు ప్రజలు 'పవర్' పీకేశారు: మంత్రి డోలా



విజయవాడ: గత ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా జగన్ చేసిన పాపాలు నేటికీ రాష్ట్ర ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ధ్వజమెత్తారు. ప్రజలపై నాడు విద్యుత్ భారాలు మోపి.. నేడు ఏమీ తెలియనట్లు ధర్నాలకు పిలుపునివ్వడం సిగ్గుచేటని మండిపడ్డారు. తాను పెంచిన ఛార్జీలపై తన పార్టీ శ్రేణులతోనే ధర్నాలు చేయించడం సైకో చర్య అని దుయ్యబట్టారు. ఏపీఈఆర్సీ అనుమతించిన దాని కన్నా రూ.19 వేల కోట్లు అదనంగా విద్యుత్ కొనుగోళ్లకు ఖర్చు చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. యూనిట్ రూ.5కే వచ్చే విద్యుత్‌ను జగన్ ప్రభుత్వం కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్‌లో రూ.8 నుంచి రూ.14కు కొనుగోలు చేసిందని ఆరోపించారు. సర్దుబాటు ఛార్జీల రూపంలో ప్రజలపై భారం మోపేందుకు ఆనాడే ఏపీఈఆర్సీ అనుమతి కోరింది వాస్తవం కాదా అని నిలదీశారు. ఆయన అవినీతి, ధన దాహం వల్లే ప్రజలపై భారం పడిందని విమర్శించారు. పవర్ ఛార్జీలు పెంచినందుకే.. ఆయనకు ప్రజలు పవర్ పీకేశారన్న విషయం జగన్ తెలుసుకోవాలని హితవు పలికారు. ఇకనైనా ప్రజలను మోసం చేయడం మానుకొని వాస్తవాలు గ్రహించాలని సూచించారు.

# పేర్ని కోలుకోవడం కష్టమేనా..?



మచిలీపట్నం : పేర్ని నాని.. రాజకీయాలు యూటర్న్ తీసుకున్నాయి. నిన్న మొన్నటి వరకు వైసీపీ మౌత్ పీస్‌గా మారి.. తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించి.. కూటమి సర్కారుపై నిప్పులు చెరిగిన పేర్ని.. ఇప్పుడు ఐపు, అజా లేకుండా పోయారు. తన సతీమణి జయసుధ పేరిట ఉన్న గోదాముల్లో రేషన్ బియ్యం మాయం కావడం.. దీనికి సంబంధించి సుమారు రెండు కోట్ల రూపాయల వరకు ప్రభుత్వానికి ఆయన సొమ్ములు చెల్లించడం తెలిసిందే. అయితే.. ఆ తర్వాత.. కూడా పేర్ని ఎక్కడా మీడియా ముందుకు రాలేదు. సీఐడీ అధికారులు దీనిపై కేసు నమోదు చేసిన విషయం.. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ విషయాన్నిసీరియస్‌గా తీసుకోవడంతో పేర్నికి ఇప్పుడు దారులు కనిపించడం లేదు. నిన్న మొన్నటి వరకు.. వాళ్లు అవినీతి చేశారు. వీళ్లు బెల్టు షాపులు పెట్టారు.. అంటూ.. పేర్ని హడావుడి చేశారు. అయితే.. తన మెడకే ఇంత పెద్ద ఉచ్చు చిక్కుకుంటుందని ఆయన ఊహించ లేకపోయారు. దీంతో పేర్ని రాజకీయంగా డైల్యూట్ అయ్యారనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అదే సమయంలో తన వారుగా ఉన్న కొందరు అధికారులను కూడా నాదెండ్ల తప్పించారు. ఇది మరింతగా పేర్నికి మైనస్ అయింది. ఈ పరిణామాలకు తోడు.. వైసీపీ నుంచి ఎలాంటి మద్దతు లభించలేదు. పైగా.. ఇప్పటి వరకు పేర్నిని పలకరించిన వారు ఉన్నారే తప్ప.. ఈ విషయంలో ఎవరూ ఆయనకు దన్నుగా నిలిచిన వారు కనిపించలేదు. ఇదిలావుంటే.. గతంలో పౌరసరఫరాల శాఖ మంత్రిగా పనిచేసిన.. కొడాలి నాని విషయంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. పేర్ని వ్యవహారంలో కొడాలి పాత్ర ఉందన్న సమాచారం మేరకు.. ఆదిశగా కూడా అడుగులు వేస్తున్నారు. పేర్ని ద్వారానే కొడాలి నాని పాత్రను వెలుగులోకి తీసుకువచ్చి.. ఆదిశగా చర్యలు తీసుకునేలా వ్యూహాత్మకంగా అడుగులు పడుతున్నాయి. దీంతో పేర్ని మరింత సైలెంట్ అయ్యారా? కొడాలి పేరు చెబితే.. ఈ కేసు మరింత పెరుగుతుందని ఆయన ఆలోచన చేస్తున్నారా? అనేది కూడా చర్చకు దారితీసింది. కానీ, సర్కారు మాత్రం పేర్నిని వదిలేలా కనిపించడం లేదు. రేపో మాపో.. జయసుధను అరెస్టు చేసిన ఆశ్చర్యం లేదని అంటున్నారు పరిశీలకులు.

# అది పిచ్చి తుగ్లక్ జగన్‌కే చెల్లుతుంది : మంత్రి అనగాని

అమరావతి, డిసెంబర్ 27: రాష్ట్రంలో కరెంట్ చార్జీల పెంపుపై వైసీపీ చేస్తున్న ధర్నాపై ఏపీ మంత్రులు, ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా వైసీపీ నేతలనే నిరసన చేయడం సిగ్గు చేటు అంటూ విమర్శలు గుప్పించారు. తాజాగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. తన పాలనలో రాష్ట్ర విద్యుత్ రంగంపై దాదాపు లక్షా 30 వేల కోట్ల రూపాయల భారాన్ని మోపిన జగన్ ఇప్పుడు చిలకపలుకులు పలుకుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. యూనిట్‌కు ఐదు రూపాయలకు దొరికే విద్యుత్‌కు బదులు 8 నుంచి 14 రూపాయల వరకు కొనుగోలు చేసి ప్రజలపైన జగన్ రెడ్డి మోయలేని భారాన్ని మోపారన్నారు. సోలార్, విండ్ ఎనర్జీ పీపీఎలను రద్దు చేసి రాష్ట్రానికి 10 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తును జగన్ అందుబాటులో లేకుండా చేశారని విమర్శించారు. 2022 నుంచి 2024 వరకు రెండేళ్ల కాలానికి రూ.17 వేల కోట్ల ట్రూఅప్ ఛార్జీలను పెంచాలని అనాడే జగన్ సర్కార్ ఆమోదించిందన్నారు. ఆ ట్రూ అప్ ఛార్జీలనే రెండేళ్ల పాటు పెంచకుండా ప్రస్తుతం డిసెంబర్ నుంచి అమలు చేయాలంటూ ఈఆర్సీ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. తాను పెంచాలని సూచించిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా తానే పోరాటం చేయడం పిచ్చి తుగ్లక్ జగన్‌కు మాత్రమే చెల్లిందంటూ మంత్రి అనగాని సత్యప్రసాద్ విరుచుకుపడ్డారు.

# అధికారం దక్కలేదన్న అక్కసుతోనే జగన్ కొత్త నాటకాలు: ప్రత్తిపాటి



అమరావతి: అధికారం దక్కలేదన్న అక్కసుతోనే జగన్ కొత్త నాటకాలు ఆడుతున్నారని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. విద్యుత్ ఛార్జీల భారం జగన్ అవినీతిలో భాగమే అని పేర్కొన్నారు. ప్రజలపై భారం వేయడానికి ఈఆర్సీకి ప్రతిపాదనలు పంపింది ఆయనేనని చెప్పారు. "జగన్.. రాష్ట్ర విద్యుత్ రంగానికి చేసిన నష్టం రూ.1,29,503 కోట్లు. ఐదేళ్లలో 10 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు. దీంతో రూ.32,166 కోట్లు దండుకున్నారు. ఆయన పాలనలో విద్యుత్ సంస్థలపై వేసిన అప్పులే రూ.50 వేల కోట్లు" అని ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు.

# దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయింది: ఎంపీ బాలశౌరి



దిల్లీ: మన్మోహన్ సింగ్ మృతితో దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మన్మోహన్ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని కొనియాడారు. దేశ రాజకీయాల్లో విద్యావేత్త, గుణ సంపన్నుడు, నిజాయతీపరుడు అని పేర్కొన్నారు. దేశంలో 35 కోట్ల చిన్న, సన్నకారు రైతులకు రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదని గుర్తుచేశారు. ఆయన హయాంలోనే గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపుదిద్దుకుందని చెప్పారు. దేశంలో ఉగ్రవాదాన్ని అణచివేయడానికి జాతీయ దర్యాప్తు సంస్థ ఏర్పాటు చేశారన్నారు. 3జీ, 4జీలతో మొబైల్ విప్లవం మొదలైందని పేర్కొన్నారు. "ఒక ఎంపీగా ఆయన నుంచి ఎన్నో నేర్చుకున్నాను. ఆయన నిరాడంబరుడు. పీవీ నరసింహారావు ప్రధాన మంత్రిగా ఉన్న కాలంలో మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో ఆయన తీసుకున్న సంస్కరణలు, ఆర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించాయి. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ప్రణాళికా సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధాన మంత్రిగా ఆయన దేశానికి చేసిన సేవలు అమూల్యం. ఆర్థిక మంత్రి కాగానే ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ లాంటి సంస్థలను ఒప్పించి భారతదేశాన్ని ఆర్థిక సుడిగుండం నుంచి బయట పడేసిన వ్యక్తి మన్మోహన్ సింగ్. సుదీర్ఘ కాలం రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను" అని బాలశౌరి పేర్కొన్నారు.

# మన్మోహన్‌కు ఏపీ మంత్రులు, ఎంపీల నివాళులు

అమరావతి : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌మృతిపట్ల ఏపీ మంత్రులు, ఎంపీలు సంతాపం తెలిపారు. మన్మోహన్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా మన్మోహన్ దేశానికి ఎన్నో సేవలు అందించారని తెలిపారు. దేశ ప్రగతికి మన్మోహన్ సింగ్ చేసిన సేవలను మరువలేమన్నారు. ఆర్థిక మేధావి కన్నుమూత దేశానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను కొత్త పుంతలు తొక్కించిన ఘనత మన్మోహన్ సింగ్ దే అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. మాజీ ప్రధాని మృతికి సంతాపం తెలిపిన పయ్యావుల.. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆర్బీఐ గవర్నరుగా, ఆర్థిక శాఖ మంత్రిగా.. ప్రధానిగా మన్మోహన్ సింగ్ ఆర్థిక రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలు మరువలేమని అన్నారు. 1991లో మన్మోహన్ సింగ్ తెచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశ గతిని మార్చాయన్నారు. నరేగా చట్టం ద్వారా పేదలకు ఉపాధి చూపించారని.. ఆర్టీఐ చట్టం ద్వారా సమాచార విప్లవానికి బీజం వేశారని వెల్లడించారు. ఆర్థిక రంగంలో మన్మోహన్ సింగ్ స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ప్రగతికి మన్మోహన్ సింగ్ చేసిన సేవలను మరువలేమని అన్నారు. ఓ రాజనీతిజ్ఞుడిని, ఓ ఆర్థిక సంస్కరణకర్తను దేశం కోల్పోయిందని మంత్రి పయ్యావుల కేశవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# జీవితంలో స్పీడ్ బ్రేకర్లు గుంతల పై స్టార్ హీరో

జీవితాన్ని తాను డ్రైవింగ్ చేయడానికి ఇష్టపడే రోడ్లతో, మలుపులు ఎత్తుపల్లాలతో పోల్చాడు దుల్కార్ సల్మాన్. తన భార్య అమల్ సూఫియాతో 13ఏళ్ల ప్రయాణాన్ని అతడు విశ్లేషిస్తూ ఒక సుదీర్ఘ నోట్ రాసాడు. నేడు 13వ పెళ్లి రోజు సందర్భంగా దుల్కార్ రాసిన నోట్ చాలా అంతర్గత విషయాలను నర్మగర్భంగా వెల్లడించింది. ప్రేమ ఇప్పటికీ ఉందని చెప్పడానికి నిదర్శనం నా భార్య.. నేను ఉన్నంత వరకు ఆమెతోనే ప్రయాణం అంటూ ఎమోషనల్ నోట్ రాసాడు. వైఫ్ అమల్‌తో రొమాంటిక్ ఫోటోలను షేర్ చేసిన దుల్కర్ క్యాప్షన్ తమ అందమైన జీవిత ప్రయాణం గురించి చెబుతూ... ఒకరినొకరు



భార్యాభర్తలు అని పిలుచుకోవడం నుండి .. తల్లిదండ్రులుగా పిలుపు అందుకునే స్థాయికి వారు ఎలా ఎదిగారో తెలిపాడు. జీవితం నేను డ్రైవ్ చేయడానికి ఇష్టపడే రోడ్లతో సమానం. ఎన్నో మలుపులు.. హెచ్చు తగ్గులు ఎదురయ్యాయని అతడు నోట్‌లో రాసాడు. జీవితంలో కొన్నిసార్లు స్పీడ్ బ్రేకర్లు గుంతలు ఉంటాయని, అయితే అందమైన బాటలో అద్భుతమైన వ్యూతో మృధువైన రోడ్లను కూడా జీవితం అందిస్తుందని దుల్కర్ పేర్కొన్నారు. సుఫియా తన పక్కన ఉంటే ఎలాంటి సవాల్‌ని అయినా అధిగమించగలనని .. లక్ష్యాలను చేరుకోగలనని దుల్కర్ నమ్మకాన్ని వ్యక్తం చేశాడు. దుల్కర్-అమల్ జంటకు సినీపరిశ్రమ స్నేహితులు, బంధువుల నుంచి పెళ్లి రోజు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. టోవినో థామస్ దంపతులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. అదితి రావ్ హైదరీ కూడా కొన్ని రెడ్ హార్ట్ ఎమోజీలను షేర్ చేసి ప్రేమ జంటను ఆకాశానికెత్తేసింది. దుల్కర్ సల్మాన్ 22 డిసెంబర్ 2011న అమల్ సూఫియాను పెళ్లి చేసుకున్నారు. 2017లో వారు తమ మొదటి బిడ్డ మరియం అమీరా సల్మాన్ కు స్వాగతం పలికారు. దుల్కర్ నటించిన లక్కీ భాస్కర్ ఇటీవలే విడుదలై బ్లాక్ బస్టర్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అతడి నటనకు ప్రశంసలు కురిసాయి. తెలుగులో ఓకే బంగారం, సీతారామం, మహానటి లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాల్లో నటించిన దుల్కర్ సల్మాన్ కి నిత్యామీనన్ తో ఎఫైర్ ఉందన్న ప్రచారం సాగింది. కానీ ఆ తర్వాత అవన్నీ రూమర్లు అని అభిమానులకు స్పష్టత వచ్చింది. దుల్కర్ - నిత్యా మీనన్ కలిసి ఐదు చిత్రాల్లో జంటగా నటించారు.

## 'కుబేర' రంగంలోకి దిగేది అప్పుడేనా?

కోలీవుడ్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ములా దర్శకత్వంలో కుబేర పాన్ ఇండియాలో తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇది ముంబై బ్యాక్ డ్రాప్ మాఫియా స్టోరీ. ఇప్పటికే షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. ప్రస్తుతం చివరి దశ షూటింగ్ దశలో ఉందీ సినిమా. ప్రధాన పాత్ర ధారులపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్లకు మంచి రెస్పాన్స్ వచ్చింది. నాగార్జున, ధనుష్ మునుపెన్నడు పోషించని పాత్రలు పోషిస్తున్నారు. ఇరువురి ఫస్ట్ లుక్ పోస్టర్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే ఇంత వరకూ రిలీజ్ తేదీపై సరైన క్లారిటీ



రాలేదు. తాజాగా దానికి సంబంధించిన లీకులు అందుతున్నాయి. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి మూడవ వారంలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అందుకు తగ్గట్టు పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్లాన్ చేసుకుని మేకర్స్ ముందుకెళ్తున్నట్లు సమాచారం. శేఖర్ కమ్ములా యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందిస్తున్నారు. ఇలాంటి జానర్లో కమ్ములా ఇంతవరకూ సినిమా చేయలేదు. ఆయన సినిమాలు ఇంతవరకూ సాఫ్ట్ గానే కనిపించాయి. హీరోలు ఫైటింగ్ లు చేయడం అన్నది ఏ సినిమాలో లేదు. తొలిసారి ఆయన మార్క్ ని పక్కనబెట్టి దర్శకుడిగా కొత్తగా ట్రై చేస్తున్నారు. అయితే ఆ ప్రయత్నం ఇన్నోవేటివ్ గా ఉంటుంది అన్నది ప్రేక్షకుల నమ్మకం. లీడర్, ఆనంద్ లాంటి కెరీర్ ఆరంభంలో చేసిన చిత్రాలతోనే కమ్ములా అంటే మార్కెట్ లో ఓ బ్రాండ్ పడి పోయింది. ఆయన చేసిన సినిమాలు డిజాస్టర్ అయిన చరిత్ర ఇంత వరకూ ఏ సినిమాకు లేదు. హిట్...యావరేజ్ గా ఆడిన చిత్రాలే. ఈసారి కుబేర కోసం ఏకంగా ఇద్దరి స్టార్లను రంగంలోకి దించి చేస్తున్నారు. దీంతో అంచనాలు పీక్స్ లో ఉన్నాయి.





# స్కూల్ ఈవెంట్లో జాన్వీ వింత వేషం?



జాన్వీ కపూర్ ఇటీవల దేవర చిత్రంతో పాన్ ఇండియా స్టార్ గా ఎదిగింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద దాదాపు 400కోట్లు వసూలు చేసింది. తన తల్లిగారైన శ్రీదేవిని పెద్ద స్టార్ ని చేసిన పరిశ్రమలో ఇంత పెద్ద గ్రాండ్ స్టార్ట్ జాన్వీలో ఆనందం నింపింది. తదుపరి మరో టాలీవుడ్ అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ సరసన బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న స్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ నటిస్తున్న సంగతి తెలిసిందే. వరుసగా టాలీవుడ్ అగ్ర హీరోల సరసన ఈ బ్యూటీ అవకాశాలు అందుకుంటోంది. అదే సమయంలో జాన్వీ కపూర్ ముంబైలో ర్యాంప్ షోలు, ఈవెంట్లలోను అదరగొడుతోంది. తాజాగా ముంబైలో అత్యంత వైభవంగా జరుగుతున్న ధీరూభాయి అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలో జాన్వీ కపూర్ కళ్లుచెదిరే ట్రీటిచ్చింది. ఈ బ్యూటీ మిరుమిట్లు గొలిపే డిజైనర్ దుస్తుల్లో మెరుపులు మెరిపించింది. మిరుమిట్ల పింక్ కలర్ మినీ డ్రెస్ లో జాన్వీ చాలా అద్భుతంగా కనిపించింది. మెరిసే హీల్స్ మెరిసే గ్లామ్ మేకప్‌తో అందరి దృష్టిని తనవైపు తిప్పేసుకుంది. అయితే ఒక స్కూల్ ఈవెంట్లో ఈ తరహా వస్త్రధారణ సరికాదని కొందరు నెటిజనులు భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. ఇదే ఈవెంట్ లో పలువురు అందాల భామలు గ్లామరస్ దుస్తుల్లో కనిపించినా జాన్వీ కొంత హై ఎండ్ గ్లామర్ ని ఎలివేట్ చేసే దుస్తుల్లో కనిపించిందని వాదిస్తున్నారు. ఇదేమీ రెగ్యులర్ ర్యాంప్ షో కాదు.. ఫ్యాషన్ షో అసలే కాదు. పేరెంట్‌తో కలిసి పిల్లలు ఒక ఆహ్లాదకర వాతావరణంలో ఈవెంట్ ని తిలకించే సందర్భం. ఇలాంటి వేదికకు కూడా జాన్వీ ఇంత గ్లామరస్‌గా రావాలా? అంటూ ప్రశ్నిస్తున్నారు కొందరు. ప్రస్తుతం జాన్వీ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి.

**అంబానీ స్కూల్‌లో చదవలేదు:** ఆసక్తికరంగా జాన్వీ కపూర్ తాను ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుకోలేదని గతంలో ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. ముంబైలోని ఎకోల్ మోండియాల్ వరల్డ్ స్కూల్‌లో చదువుకున్నానని, అయితే ప్రతిష్టాత్మక అంబానీ స్కూల్‌లో చదివిన తన స్నేహితుల కారణంగా తాను కూడా అదే స్కూల్ లో చదివానని అనుకుంటారని కూడా తెలిపింది. బాలీవుడ్ లో చాలామంది స్టార్ కిడ్స్ అంబానీ స్కూల్ లోనే విద్యాభ్యాసం సాగిస్తున్నారు. ఆ తర్వాత మాస్టర్స్ కోసం విదేశాల బాట పడుతున్నారు.


# చరణ్ 'డోప్'.. ఫ్యాన్స్ కు కావాల్సింది ఇదేగా!!



టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్ అప్ కమింగ్ మూవీ గేమ్ ఛేంజర్.. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న విషయం తెలిసిందే. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆ సినిమా.. మరో 18 రోజుల్లో థియేటర్స్ లో సందడి చేయనుంది. ఇప్పటికే మూవీపై ఆడియెన్స్ లో భారీ అంచనాలు ఉండగా.. మేకర్స్ వాటిని రోజురోజుకు పెంచుకుంటూ పోతున్నారు. అయితే మ్యూజికల్ ప్రమోషన్స్ లో భాగంగా మేకర్స్ ఓ రేంజ్ లో సందడి చేస్తున్నారు. జరగండి జరగండి.., రా మచ్చా మచ్చా.., నా నా హైరానా.. సాంగ్స్ ఓ రేంజ్ లో అందరినీ అలరించాయి. చార్ట్ బస్టర్స్ గా నిలిచి.. మూవీపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. మేకర్స్ లో ఫుల్ జోష్ కూడా నింపాయి. ఇప్పుడు అదే జోష్ తో మేకర్స్.. ఫోర్త్ సింగిల్ డోప్ ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. అమెరికాలోని డల్లాస్ లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లో మేకర్స్ డోప్ సాంగ్ ను విడుదల చేయగా.. కాసేపటికే ట్రెండింగ్ లోకి వచ్చేసింది. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ లో ఓ రేంజ్ లో సందడి చేస్తోంది. భారీ వ్యూస్ అందుకుని రాణిస్తోంది. ఇనస్టెంట్ చార్ట్ బస్టర్ గా నిలిచి మ్యూజిక్ లవర్స్ ను మెప్పిస్తోంది. అందర్నీ ఫిదా చేసి తెగ ట్రెండ్ అవుతోంది. అదే సమయంలో చరణ్ ఫ్యాన్స్.. డోప్ లిరికల్ సాంగ్ ను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. సింపుల్ గా చెప్పాలంటే.. పండుగ చేసుకుంటున్నారు. తెగ ఆకట్టుకుంటుందని, రిపీట్ మోడ్ లో చూస్తున్నామని చెబుతున్నారు. తమకు కావాల్సిన కంటెంట్ ఇదేనని.. చరణ్ స్టెప్పులు ఇరగదేశారని కొనియాడుతున్నారు. చెప్పాలంటే.. అది అక్షరాలా నిజం. తమన్ అదిరిపోయే కంపోజిషన్ కు చరణ్ అంతకు మించి స్టెప్పులు వేశారు. ఆయన డ్యాన్స్ హైలైట్ గా నిలుస్తోంది. డోప్ పాటకు బాడీని మెలికలు తిప్పేశారు చరణ్. చాలా రోజుల తర్వాత ఆయన వింటేజ్ డ్యాన్స్ కనిపిస్తోంది. ఆర్ ఆర్ ఆర్ లో నాటు నాటు తప్ప చరణ్ కు స్టెప్పులు వేసే స్కోప్ దొరకలేదు. ఆచార్యలో చిన్న స్టెప్పులు మాత్రమే వేశారు. ఇప్పుడు డోప్ తో మాత్రం అలరించనున్నట్లు కనిపిస్తున్నారు. అయితే సాంగ్ లో డైరెక్టర్ శంకర్ క్రియేటివిటీ.. జానీ మాస్టర్ మార్క్ క్లియర్ గా తెలుస్తోంది. వాటికి తమన్ బీట్.. చరణ్ డ్యాన్స్ తోడు అవ్వడంతో సాంగ్ అదిరిపోయిందనే చెప్పాలి. పాట రిలీజ్ కు ముందు.. చిన్న ప్రోమో, కామెంట్స్ క్రియేట్ చేసిన అంచనాలను అందుకొని ఆకట్టుకుంటోంది. మరి జనవరి 10వ తేదీన సిల్వర్ స్క్రీన్ పై డోప్ సాంగ్ ఎలా ఉంటుందో చూడాలి.

# రష్మిక 2024.. నెం.1 హీరోయిన్ గా సెండాఫ్!

రష్మిక మందన్న.. పాన్ ఇండియా స్థాయిలో టాప్ హీరోయిన్ ఎవరంటే చాలా మంది ఆమె పేరునే కచ్చితంగా చెప్తారన్న విషయంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. తన అందం, అభినయంతో వేరే లెవెల్ లో మెప్పిస్తున్న రష్మిక.. వరుస అవకాశాలు అందుకుంటున్నారు. నాన్ స్టాప్ షూటింగ్స్ తో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. కిరిక్ పార్టీ మూవీతో కెరీర్ ను స్టార్ట్ చేసిన రష్మిక.. ఛలో మూవీతో టాలీవుడ్ లోకి వచ్చారు. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. అనేక బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్నారు. పుష్ప చిత్రంతో నేషనల్ క్రష్ గా మారిపోయారు. పాన్ ఇండియా రేంజ్ లో తన ఫ్యాన్ బేస్ ను పెంచుకున్నారు. ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా మారారు. యానిమల్ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని 2023ను ముగించిన రష్మిక.. ఇప్పుడు వేరే లెవెల్ హిట్ తో 2024కు సెండాఫ్ ఇస్తున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా వచ్చిన పుష్ప 2: ది రూల్ తో రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన



రష్మిక.. అదిరిపోయే హిట్ ను సొంతం చేసుకున్నారు. శ్రీవల్లి 2.0గా అందరినీ మెప్పించారు. తన అద్భుతమైన యాక్టింగ్ తో సర్వత్రా ప్రశంసలు అందుకున్న రష్మిక.. అన్ని భాషల్లో తన సత్తా ఏంటో చూపించారు. అగ్ర కథానాయికగా ఆమె స్థానాన్ని మరోసారి సుస్థిరం చేసుకున్నారు. అలా పుష్ప-2 విజయంతో 2024లో రష్మిక క్రేజ్ మరో ఎత్తుకు చేరిందని చెప్పాలి. కొన్నాళ్లపాటు ఇండస్ట్రీని రష్మిక ఏలడం పక్కా! అయితే రష్మిక.. ప్రస్తుతం తన కెరీర్ లో హైయెస్ట్ స్టేజ్ లో ఉన్నారు. త్వరలో మరిన్ని పాన్ ఇండియా చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అదే సమయంలో లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతో సందడి చేయనున్నారు. ఇప్పుడు ది గర్ల్ ఫ్రెండ్ మూవీతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా ఆ సినిమా టీజర్ రిలీజ్ అవ్వగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. దాంతోపాటు శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న కుబేరలో కూడా యాక్ట్ చేస్తున్నారు రష్మిక. తమిళ, తెలుగు మూవీ రెయిన్ బోలో నటిస్తున్నారు. బాలీవుడ్ లో సల్మాన్ ఖాన్ తో కలిసి సికిందర్ లో హీరోయిన్ గా కనిపించనున్న రష్మిక.. చావా ప్రాజెక్టును పూర్తి చేస్తున్నారు. అలా వచ్చే ఏడాది వివిధ సినిమాలతో థియేటర్లలో రానున్నారు నేషనల్ క్రష్. మొత్తానికి 2024ను హిట్ తో ముగించిన అమ్మడు.. 2025లో ఫుల్ గా సందడి చేయనుండడం పక్కా.

## లక్కీ టైం కోసం వెయిట్ చేస్తున్న అమ్మడు..!

మలయాళ భామ అనుపమ పరమేశ్వరన్ ఈ ఇయర్ టిల్లు స్క్వేర్ తో ప్రేక్షకులను అలరించింది. సిద్ధు జొన్నలగడ్డ ఖాతాలో ఈ సినిమా 100 కోట్లు పడేలా చేసింది కానీ అనుపమకు మాత్రం ఏమాత్రం లక్ కలిసి వచ్చేలా చేయలేదు. 100 కోట్లు కొట్టాక ఏ హీరోయిన్ కి అయినా వరుస ఛాన్స్ లు వస్తాయి. కానీ అనుపమకు మాత్రం ఆ అవకాశం లేదు. తెలుగులో ఎందుకో ఆమె చేస్తున్న ప్రయత్నాలు ఏవి అంతగా వర్క్ అవుట్ కావట్లేదు. హిట్ పడ్డాక కూడా ఆఫర్లు రాకపోవడం అన్ లక్కీ అనే చెప్పొచ్చు. ఐతే టాలీవుడ్ లో అవకాశాలు లేకపోయినా కూడా మలయాళం లో రెండు తమిళంలో రెండు సినిమాలు చేస్తుంది అమ్మడు. మలయాళంలో సినిమాలు ఆల్రెడీ షూటింగ్ పూర్తయ్యాయి. తమిళ సినిమాలు సెట్స్ మీద ఉన్నాయి. సినిమాల గ్యాప్ లో ఫోటో షూట్స్ తో కూడా అనుపమ అలరిస్తుంది. రకరకాల ఫోటో షూట్స్ తో తన ఫాలోవర్స్ ని మెప్పిస్తుంది అమ్మడు. అనుపమకు తెలుగులో క్రేజీ ఫ్యాన్స్ ఉన్నారు. అ ఆ



నుంచి టిల్లు స్క్వేర్ వరకు అనుపమ చేసిన సినిమాలు రిజల్ట్ ఏదైనా సరే ఆమె ఫ్యాన్స్ కి మాత్రం బాగా నచ్చేశాయి. ఐతే ఈ క్రేజ్ ఆమెకు అవకాశాలు తెప్పించడం లో మాత్రం యూజ్ అవ్వట్లేదు. అనుపమ కూడా తనకు ఛాన్స్ ఇస్తే చేస్తా కానీ అవకాశాల కోసం ఎదురు చూడను అన్నట్టుగా ఉంది. స్టార్ హీరోయిన్ అవ్వాల్సిన క్వాలిటీస్ అన్నీ ఉన్నా కూడా ఎందుకో అమ్మడికి కాలం కలిసి రావట్లేదు. తన దాకా వచ్చిన ప్రతి ఆఫర్ ను చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తూ వస్తుంది. కెరీర్ లో ఒక బంపర్ హిట్ కోసం ఎదురుచూస్తున్న అనుపమకి అది ఏ సినిమాతో కుదురుతుందో లేదో చూడాలి. కమర్షియల్ సినిమాల కన్నా ముఖ్యంగా కంటెంట్ ఉన్న సినిమాల్లో లీడ్ రోల్ గా చేయాలని ఆసక్తిగా ఉన్న అనుపమ అన్ని రకాల సినిమాలతో అలరించాలని ఫిక్స్ అయ్యింది. టాలీవుడ్ ఎంట్రీ గ్రాండ్ గా ఇచ్చినా తర్వాత సినిమాల విషయంలో తప్పులు తడకలు వేసింది అనుపమ ఐతే అమ్మడు తిరిగి స్ట్రాంగ్ కం బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నా కూడా అది జరగట్లేదు. మరి అది ఏ సినిమాతో అవుతుంది అన్నది చూడాలి.



# మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి

దిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. బెళగావి నుంచి నేరుగా దిల్లీ వెళ్లిన సీఎం... అక్కడి నుంచి మన్మోహన్ నివాసానికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, పలువురు ఎంపీలు, కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

# తెలంగాణ ఎప్పటికి రుణపడి ఉండే ఒకే ఒక్కడు



హైదరాబాద్ : కోట్లాది ప్రజల కలల్ని తీర్చినోడు. కన్నీళ్లను తుడిచినోడు. ప్రాణ త్యాగాలకు తల్లడిల్లినోడు.. తెలంగాణ నుంచి తీసుకోవటమే కానీ ఇవ్వటం చేతకాని లక్షల నేతలకు భిన్నంగా.. దశాబ్దాల తరబడి వాస్తవంగా మారని డిమాండ్ ను తీర్చినోడు ఎవరైనా ఉన్నారంటే.. అది ఒక్క మన్మోహన్ సింగ్ మాత్రమే. తెలంగాణ నుంచి అందరూ తీసుకున్నోళ్లే. ఇవ్వటమే తప్పించి.. తీసుకోని నేత ఎవరైనా ఉన్నారంటే అది మన్మోహన్ సింగ్ మాత్రమేనని చెప్పాలి. తెలంగాణ రాష్ట్ర సాధనకు సోనియా గాంధీ ఓకే చెప్పిన తర్వాతే.. రియాలిటీలోకి వచ్చిందన్నది నిజమే అయినప్పటికీ.. ఆ రోజుల్లో ప్రధాన మంత్రిగా ఉన్న మన్మోహన్ మోకాలు అడ్డు పెట్టకున్నా.. ఏదో ఒక చిన్న పుల్ల వేసినా.. తెలంగాణ కల సాకారం అయ్యేది కాదు. తెలంగాణకు రవ్వంత ఇచ్చి.. కొండంత తీసుకున్నోళ్లు ఎందరో. కానీ.. తానేమీ ఆశించకుండా తెలంగాణకు ఇవ్వటమే తప్పించి.. తిరిగి తీసుకోవటం రాని తత్వం ఆయన సొంతం. ఇంత ఎందుకు.. తెలంగాణ ప్రజల ఆకాంక్షల్ని తీర్చిన ఆయన.. దానికి సంబంధించిన చిన్నపాటి క్రెడిట్ తీసుకోవటం కనిపించదు. తెలంగాణ అంశాన్ని టేకప్ చేసి పోరాడి సాధించి క్రెడిట్ ను కేసీఆర్ సొంతం చేసుకుంటే.. తెలంగాణను ఇచ్చింది సోనియాగాంధీగా పేరు సొంతం చేసుకున్నారు. అయితే.. పార్టీ విధానానికి తగ్గట్లు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మన్మోహన్ మాత్రం మౌనంగానే ఉన్నారు. తాను చేయాల్సింది చేసుకుంటూ పోయారు. సోనియా.. కేసీఆర్ కు తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించినట్లుగా కనిపించినప్పటికీ.. అందుకు తన వంతు సాయాన్ని అందించటంలో మన్మోహన్ ముందున్నారు. అయినప్పటికి.. తనకెలాంటి క్రెడిట్ దక్కకపోవటాన్ని ఆయన పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించదు అదే.. ఆయనకు మాత్రమే సాధ్యమని చెప్పాలి.

# తెలంగాణకు మన్మోహన్‌తో ప్రత్యేక అనుబంధం: మాజీ సీఎం కేసీఆర్



హైదరాబాద్: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు భారత రాష్ట్ర సమితి (భారాస) నేతలు హాజరు కానున్నారు. భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, పార్టీ ఎంపీలు, ప్రతినిధులు నివాళులర్పించనున్నారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు హాజరు కావాలని కేటీఆర్, ఎంపీలను ఆ పార్టీ అధినేత ఆదేశించారు. ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్టుగా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారన్నారు. ఆయనతో తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని కేసీఆర్ అన్నారు. "తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు మన్మోహన్ అందించిన సహకారం తెలంగాణ సమాజం ఎప్పటికీ మర్చిపోదు. తెలంగాణ కోసం పోరాడిన సమయంలో ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ అండగా నిలిచారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగింది. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో ఆయన అందించిన సహకారం మరువలేనది. తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్‌కు భారాస తరఫున ఘన నివాళులు" అని కేసీఆర్ అన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి.. ఎమ్మెల్సీ కవిత డిమాండ్



హైదరాబాద్: బీసీల రిజర్వేషన్ పెంపుపై స్పష్టత ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి వీల్లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నదని చెప్పారు. బీసీ సంఘాలతో హైదరాబాద్‌లోని తన నివాసం లో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బీసీల జనాభా ఎంతో తెలికుండా హామీ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. జనాభాలో సగానికిపైగా బీసీలు ఉన్నారని చెప్పారు. కానీ 42 శాతం అని కాంగ్రెస్ ఎలా చెబుతుందో అంతుపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండానే ఎన్నికలు నిర్వహిస్తారా.. అనే అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుంటే ఎన్నికలు జరగనిచ్చేది లేదని స్పష్టం చేశారు. మండల కేంద్రాలు, జిల్లాల్లో నిరసన ప్రదర్శన చేస్తామన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చిన తర్వాత, బీసీ జనాభాను వెల్లడించిన తర్వాతే ఎన్నికలపై ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల గురించి ప్రభుత్వం ఆలోచన చేయకూడదని చెప్పారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభను నిర్వహిస్తామన్నారు. జనాభా లెక్కల్లో కులగణన చేపట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు ఏటా రూ.20 వేల కోట్లు బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిందని విమర్శించారు.

# మన్మోహన్ హయాంలోనే తెలంగాణ ఆవిర్భావం.. ఏపీ ఎంపీలు వ్యతిరేకించినా వెనక్కితగ్గని ధీశాలి

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం జరిగిన అరవై ఏండ్ల సుదీర్ఘ పోరాటానికి మన్మోహనుడి ప్రభుత్వంలోనే ముగింపులభించింది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలోనే నెరవేరింది. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ డిసెంబర్ 9 ప్రకటన వెలువడింది. 1971లో తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తామని మాటతప్పిన కాంగ్రెస్ తప్పును 2014లో సరిదిద్ది, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు బాటలు వేసిన ఘనత ఆయనకు దక్కుతుంది. తన ప్రభుత్వానికి పూర్తిస్థాయి మెజార్టీ లేకున్నా అత్యంత వ్యూహాత్మకంగా తెలంగాణ బిల్లును ఉభయసభల్లో గట్టెక్కించారు.

తెలంగాణ ఏర్పాటును కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆంధ్ర నేతలు, ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్ర కేబినెట్‌లో ఉన్న ఏపీ నేతలు రాజీమానా చేస్తామని బెదిరించారు. అయినప్పటికీ మన్మోహన్ సింగ్ వెనక్కి తగ్గలేదు. పార్లమెంటులో రచ్చజరిగినా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ చేయించేందుకు మన్మోహన్ సింగ్ కీలక భూమిక పోషించారన్నారు అప్పటి కేంద్రహోంమంత్రి షిండే అన్నారు. ఇక అధికారం కోల్పోయాక కూడా విభజన సమస్యల పరిష్కారానికి మన్మోహన్ డిమాండ్ చేశారు. విభజన హామీలన్నింటిని నెరవేర్చాలన్నారు. ఇక, దశాబ్దాల పాటు తెలంగాణపై కొనసాగిన అణచివేత, ఆర్థిక దోపిడీ, సామాజిక, సాంస్కృతిక వివక్ష తెలిసిన అతికొద్ది మంది జాతీయ నాయకుల్లో మన్మోహన్‌సింగ్ ముందు వరుసలో ఉంటారు. తెలంగాణ ఆకాంక్షలను, రాష్ట్రం ఆవిర్భవించకపోతే జరిగే అనర్థాలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ పూసగుచ్చినట్టు వివరిస్తే అర్థం చేసుకున్న మనసున్న పాలకుడు మన్మోహన్ సింగ్.




# కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 27: ఫార్ములా ఈకార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ తెలంగాణ హైకోర్టులో వాయిదా పడింది. కేటీఆర్‌ను ఈనెల 31 వరకు అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు ఆదేశించింది. విచారణను డిసెంబర్ 31కి వాయిదా వేసింది. కాగా.. ఫార్ములా ఈరేస్ కేసుకు సంబంధించి ఇప్పటికే హైకోర్టు డిసెంబర్ 30 వరకు కేటీఆర్‌కు నాట్ టు అరెస్ట్ ఇచ్చిన విషయం తెలిసిందే. కేటీఆర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, అరెస్ట్ చేయవద్దని గత విచారణలో హైకోర్టు ఆదేశించింది.

ఈరోజు (శుక్రవారం) ఫార్ములా ఈరేస్ కేసు హైకోర్టులో విచారణకు రాగా.. ఏసీబీ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. అలాగే ఏసీబీ మరో పిటిషన్ కూడా దాఖలు చేసింది. కేటీఆర్ నాట్ టు అరెస్ట్ ఆదేశాలను ఎత్తివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌కు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా కేటీఆర్, రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 31 వరకు వాయిదా వేసింది. ఇప్పటి వరకు 30 వరకు ఉన్న నాట్ టు అరెస్ట్‌ను.. మరొక్క రోజుకు హైకోర్టు ధర్మాసనం పొడిగించింది. ఈనెల 31న నాట్ టు అరెస్ట్ పిటిషన్‌పైన అలాగే ఫార్ములా ఈ రేసింగ్‌కు సంబంధించి నమోదైన కౌంటర్‌పై కూడా హైకోర్టు పూర్తి స్థాయిలో విచారణ జరపనుంది. ఇప్పటి వరకు ఫార్ములా ఈరేస్ వ్యవహారానికి సంబంధించి సుదీర్ఘంగా వాదనలు వినిపించిన తర్వాత కేటీఆర్‌కు హైకోర్టు స్వల్ప ఊరటనిచ్చింది. అయితే దాన్ని కూడా ఎత్తివేయాలని, పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఏసీబీ పిటిషన్‌లో పేర్కొంది. ఈ సమయంలో కేటీఆర్‌కు బెయిల్ మంజూరు చేసినా, రిలీఫ్ ఇచ్చినా, నాట్ టు అరెస్ట్ ఇచ్చినా విచారణకు ఇబ్బందికర వాతావరణం ఉంటుందని ఏసీబీ వెల్లడించింది. నాట్ టు అరెస్ట్‌ను ఎత్తివేయాలని ఏసీబీ మరో పిటిషన్‌ను వేసింది. ఆ పిటిషన్‌కు సంబంధించి ప్రతివాదిగా కేటీఆర్‌ను చేర్చారు. దీంతో కేటీఆర్ కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. డిసెంబర్ 31న ఫార్ములా ఈ కార్ రేస్‌పై ప్రభుత్వం వేసిన పిటిషన్‌పైన వాదనలు కొనసాగుతాయి. అలాగే నాట్ టు అరెస్ట్‌పై కేటీఆర్ కౌంటర్ దాఖలు చేసిన తర్వాత వాదనలు జరుగనున్నాయి. ఈ రెండు అంశాలపై డిసెంబర్ 31న ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత తెలంగాణ హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుంది అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.




హైదరాబాద్: సినీ నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసులు సమయం కోరారు.

దీంతో నాంపల్లి కోర్టు విచారణను సోమవారానికి (డిసెంబరు 30) వాయిదా వేసింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో పోలీసులు ఇటీవల ఆయన్ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు నాంపల్లి న్యాయస్థానం విధించిన 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ నేటితో ముగిసింది. దీంతో నేడు ఆయన వర్చువల్‌గా న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు.

మరోవైపు సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో విచారణనూ నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. దీనిపై తదుపరి విచారణను జనవరి 10వ తేదీన చేపట్టనున్నట్లు వెల్లడించింది. అల్లు అర్జున్ రిమాండ్‌పైనా విచారణ ఆ రోజే జరగనుంది.

# పోలీసుల ఆత్మహత్య.. అంతుచిక్కని మిస్టరీ



కామారెడ్డి, డిసెంబర్ 27: జిల్లాలో ముగ్గురి ఆత్మహత్యల కేసులో మిస్టరీ ఇంకా వీడలేదు. ఓ ఎస్సై, మహిళా కానిస్టేబుల్, ఓ యువకుడి ఆత్మహత్యలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శృతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ మరణాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


మృతుల సెల్ ఫోన్ డాటా, వాట్స్ ఆప్ చాటింగ్స్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. అలాగే ఈ ముగ్గురి బంధువులు, స్నేహితులను విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ముగ్గురి పోస్టుమార్టం రిపోర్టులు కీలకం కానున్నాయి. ఇద్దరు పోలీసుల, ఓ యువకుడి ఆత్మహత్య రహస్యాన్ని ఛేధించేందుకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సదాశివనగర్ సీఐ సంతోష్, ఎస్సై రంజిత్‌లతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు నిన్న ఉదయం 11 గంటలకు కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ బైక్‌పై బీబీపేట నుంచి బయలుదేరినట్లు పోలీసులు గుర్తించారు. నిఖిల్ తన బైక్‌ను ఎక్కడ పెట్టాడనేది తేలాల్సి ఉంది. అలాగే ఎస్ఐ సాయికుమార్ భార్య వాంగ్మూలం కీలకంగా మారనుంది. ఇవాళ ఎస్ఐ సాయికుమార్ స్వగ్రామం మెదక్ జిల్లా కొల్చారంకు దర్యాప్తు బృందం వెళ్లి సమాచారాన్ని సేకరించనుంది. భిక్కనూరు, కామారెడ్డి, బిబిపేట, అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు సమీపంలోని హొటల్‌లలో సీసీ ఫుటేజ్‌లను దర్యాప్తు బృందం పరిశీలించనుంది. వారి ఆత్మహత్యకు కారణాలేంటి.. ప్రేమ వ్యవహారమా?..లేక వివాహేతర సంబంధమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మొత్తానికి ఈ ముగ్గురి ఆత్మహత్యలు పోలీసులకు సవాల్ అని చెప్పుకోవచ్చు. అసలు ఎందుకు ఆత్మహత్యకు చేసుకున్నారు... వివాహేతర సంబంధమే కారణమా లేక మరేదైనా ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. త్వరలో ఈ మిస్టరీని ఛేధిస్తామని పోలీసులు చెబుతున్నారు.

# మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు హాజరు కానున్న బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్ : భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు బీఆర్ఎస్ ముఖ్య నేతలు హాజరు కానున్నారు. ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్ సింగ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలోని పార్టీ ఎంపీలు, నాయకుల బృందం ఘన నివాళులర్పించనుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు కేటీఆర్, ఎంపీలు, ప్రతినిధుల బృందం మన్మోహన్ సింగ్ అంత్యక్రియల్లో పాల్గొననున్నారు. మన్మోహన్ సింగ్‌కు బీఆర్ఎస్ నేతలు ఘనంగా వీడ్కోలు పలకనున్నారు. ఈ సందర్భంగా అధినేత కేసీఆర్ మాట్లాడుతూ.. దేశ ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్ట్‌గా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలందించారు. దాంతో పాటు తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం మన్మోహన్ సింగ్‌తో ఉంది. వారి కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన నాకు వారితో వ్యక్తిగత అనుబంధముంది. వారెంతో స్థితప్రజ్ఞత కలిగిన దార్శనికులు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఏర్పాటు దాకా వారందించిన సహకారం తెలంగాణ సమాజం మరువదు. తెలంగాణ కోసం పోరాడుతున్న నాకు, టీఆర్ఎస్ పార్టీకి ప్రతి సందర్భంలో మనోధైర్యాన్ని నింపుతూ వారు అండగా నిలిచారు. వారు ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగింది. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో నాకు వారందించిన సహకారం మరువలేను.

ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజానికి అత్యంత ఆప్తుడైన మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. వారి కడసారి వీడ్కోలు సందర్భంగా అంత్యక్రియల్లో పాల్గొనాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను, ఎంపీలను ఆదేశించాను. ఈ మేరకు వారు హాజరుకానున్నారు అని కేసీఆర్ తెలిపారు.

# తిరుమలపై తెలంగాణకు చెందిన మరో మంత్రి కీలక వ్యాఖ్యలు



అమరావతి : తెలంగాణ మంత్రి కొండ సురేఖ తిరుమల దర్శనంపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి నేటి వరకు తిరుమలలో తెలంగాణ భక్తులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని విమర్శించారు. శ్రీశైలం భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామిని ఆమె శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో తెలంగాణ భక్తులకు జరుగుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చే సిఫార్సు లేఖలను టీటీడీ స్వీకరించడం లేదని ఆరోపించారు. తెలంగాణ భక్తుల గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మంతనాలు జరుపుతున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడగా సీఎం సానుకూలంగా స్పందించారని అన్నారు. టీటీడీ తెలంగాణ భక్తుల మీద ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అప్పట్లో తమ దురదృష్టం వల్ల శ్రీశైలాన్ని కోల్పోయి ఆంధ్రాకు ఇవ్వాల్సి వచ్చిందని అన్నారు.తెలంగాణ నుంచి టీటీడీకి అధిక రాబడి వస్తోందని , టీటీడీ తెలంగాణలో ధర్మప్రచారానికి నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణలో దేవాలయాలు, కల్యాణ మండపాల నిర్మాణానికి టీటీడీ సహకరించాలని మంత్రి కోరారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com